www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -213 బుధవారం 5 నవంబర్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## 'డిజిటల్ అరెస్ట్' స్కాంలపై ఎన్పీసీఐ హెచ్చరిక

**డిజిటల్ అరెస్ట్' పేరుతో కొత్త తరహా మోసాలు**

**పోలీసులు, సీబీఐ అధికారులమంటూ బెదిరింపులు**

**అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎన్పీసీఐ సూచన**

**సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయాలని వెల్లడి**



దేశవ్యాప్తంగా కొత్త తరహా సైబర్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో, 'డిజిటల్ అరెస్ట్' పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) మిగతా 2లో...

## చేవెళ్ల బస్సు ప్రమాదం.. సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్

**డిసెంబర్ 15వ తేదీ లోపు నివేదిక సమర్పించాలని ఆదేశం**

**రవాణా శాఖ, హెూంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు**

**నివేదిక పంపాలని కలెక్టర్, ఆర్టీసీ ఎండీలకు కూడా ఆదేశం**



**నవంబర్ 4ప్రజావినికిడి**

రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై రాష్ట్ర మానవ హక్కుల సంఘం స్పందించింది. చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు వద్ద కంకర లోడుతో వస్తున్న టిప్పర్...మిగతా 2లో...



# జూబ్లీహిల్స్‌లో 30వేలతో గెలుపు

**చెల్లిని గెంటేసిన నీచుడు కెటిఆర్**

**రహమత్ నగర్ రోడ్‌షోలో సిఎం రేవంత్**

**నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే**

**4 వేల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తానని హామీ**



హైదరాబాద్,**నవంబర్ 4ప్రజావినికిడి** జూబ్లీహిల్స్‌లో 30 వేల మెజార్టీ తో కాంగ్రెస్ జెండా ఎగరబోతుందని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో భాగంగా మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి రహమత్ నగర్ లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఓటర్లను ఉద్దేశిస్తూ ప్రసంగం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉప ఎన్నికలు వచ్చాయి.. మా అభ్యర్థి చనిపోయారు? ఆయన సతీమణికి ఓటేయండి అని అడుగుతున్నారని, పట్నం వచ్చిన పేదలకు ఉద్యోగ.. ఉపాధి అవకాశాలు కల్పించిన వ్యక్తి పీజేఆర్ అన్నారు. పీజేఆర్ ఆడబిడ్డల కోసం కృష్ణ జలాలు హైదరాబాద్ తీసుకువచ్చారని, పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చింది పీజేఆర్ అని రేవంత్ రెడ్డి అన్నారు. ..

మిగతా 2లో...

## ఛత్తీస్‌గఢ్‌లో గూడ్స్ రైలును ఢీకొట్టిన ప్యాసింజర్ రైలు... ఆరుగురి మృతి!

**నవంబర్ 4ప్రజావినికిడి**



ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో నేడు ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. జైరామ్‌నగర్ స్టేషన్ సమీపంలో ఒక ప్యాసింజర్ రైలు, గూడ్స్ రైలును ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో కనీసం ఆరుగురు మరణించినట్లు భావిస్తున్నారు. పలువురు ప్రయాణికులు గాయంవడ్డారం. ప్రాథమిక సమాచారం ప్రకారం, కోర్బా ప్యాసింజర్ రైలు, ఆగి ఉన్న ఒక గూడ్స్ రైలును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ప్యాసింజర్ రైలు మొదటి బోగీ.. గూడ్స్ రైలు పైకి ఎక్కింది. ప్రమాద స్థలం నుంచి వచ్చిన వీడియోలలో ఈ దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, సహాయక బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు ఆరుగురు మరణించినట్లు వార్తలు వస్తున్నాయి. గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. నష్టం అంచనా వేయడంతో పాటు, ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

## రెండోదశ ఎన్నికల ఓటరు జాబితా సవరణ

**న్యూమరేషన్ ఫారాలు పంపిణీ మొదలు : ఇసి**




న్యూఢిల్లీ,**నవంబర్ 4ప్రజావినికిడి** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై ఇప్పటికే బీహార్‌లో తీవ్ర నిరసనలు చెలరేగాయి. ఇప్పుడు బెంగాల్లో మమతా బెనర్జీ స్వయంగా నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ క్రమంలో ఫేజ్-2.. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రారంభమైందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆయా రాష్ట్రాల్లో ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ మొదలు పెట్టినట్లు తెలిపింది. ఓటర్ల జాబితా ప్రక్షాళనను ..మిగతా 2లో...

# ఒక్క అవకాశం ఇస్తే తెలంగాణ సర్వనాశనం

**జూబ్లీహిల్స్ ప్రచారంలో రేవంత్‌పై కెటిఆర్ విమర్శలు**

హైదరాబాద్,**నవంబర్ 4ప్రజావినికిడి** రేవంత్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. తెలంగాణను దివాళా తీయించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రసంగించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కి ఒక్క ఛాన్స్ ఇవ్వాలని రేవంత్ రెడ్డి బతిమిలాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 700 మంది రైతులు ఆత్మహత్య చేసుకునే లాగా చేశారని ధ్వజమెత్తారు...మిగతా 2లో...



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధుల భేటీ

**తెలంగాణలో ఏడబ్ల్యూఎస్ సెంటర్లు, విస్తరణపై చర్చ**

**పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ**

**ముఖ్యమంత్రితో జర్మనీ కాన్సుల్ జనరల్ బృందం భేటీ**



2లో.

## జాబ్ క్యాలెండర్ తో మోసం

**ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు -నిరుద్యోగులను నిండా ముంచారు**

**జనంబాటలో జాగృతి అధ్యక్షురాలు కవిత**



## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

**మరోమారు షెడ్యూల్ ప్రకటించిన స్పీకర్**

**ఈ నెల 6నుంచి వరుసగా విచారణలకు సిద్ధం**

హైదరాబాద్,**నవంబర్ 4ప్రజావినికిడి**



తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణలో మరో అడుగు పడింది. ఎల్లుండి నుండి ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ జరుగనుంది. ఈనెల 6 నుంచి ఈ కేసును స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించనున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఇచ్చారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసింది...మిగతా 2లో...

## మంత్రి అజారుద్దీన్ కు రెండు కీలక శాఖలు

**తెలంగాణ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అజారుద్దీన్**

**ఆయనకు శాఖలను కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డి**

**మైనార్టీ సంక్షేమ శాఖ బాధ్యతల అప్పగింత**

**అదేవిధంగా పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ కేటాయింపు**



2లో.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## చేవెళ్ల బస్సు ప్రమాదం.. సుమోటోగా తీసుకున్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్

**(మొదటి పేజీ తరువాయి)**

బస్సును ఢీకొనడంతో 19 మంది దుర్మరణం చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, డిసెంబర్ 15వ తేదీలోపు సమగ్ర నివేదికను అందజేయాలని ఆదేశించింది. ఈ మేరకు రవాణా శాఖ, హోంశాఖ, భూగర్భ గనుల శాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీలను సైతం నివేదిక పంపాలని ఆదేశించింది. ప్రమాద సమయంలో ట్రక్కులోని కంకర బస్సులోని ప్రయాణికులపై పడటంతో ఊపిరాడక వారు మృతి చెందారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధుల భేటీ

హైదరాబాద్,**నవంబర్ 4ప్రజావినికిడి**

అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. తెలంగాణలో ఏడబ్ల్యూఎస్ ఆన్ గోయింగ్ సెంటర్లు, వాటి విస్తరణపై చర్చించింది. ఈ సమావేశానికి ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్, ఇన్‌ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.

**ముఖ్యమంత్రితో జర్మనీ కాన్సుల్ జనరల్ బృందం భేటీ**

జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ బృందం కూడా ముఖ్యమంత్రితో సమావేశమైంది. హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రికి తెలిపింది. డ్యూయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో జీసీసీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. దీని ద్వారా రానున్న రెండేళ్లలో సుమారు వెయ్యి మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని వెల్లడించింది. పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడానికి జర్మనీ సహకారం అవసరమని అన్నారు. తెలంగాణ విద్యార్థులకు జర్మన్ భాష బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని ముఖ్యమంత్రి కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ, జర్మనీ భాగస్వామ్యం మరింత బలపడాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్స్ రంగాల్లో జర్మనీ కంపెనీలను పెట్టుబడులు పెట్టమని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

## మంత్రి అజారుద్దీన్ కు రెండు కీలక శాఖలు

హైదరాబాద్,**నవంబర్ 4ప్రజావినికిడి**

ఇటీవల తెలంగాణ మంత్రిగా నియమితులైన భారత మాజీ క్రికెట్ కెప్టెన్ అజారుద్దీన్‌కు రాష్ట్ర మంత్రివర్గంలో శాఖలను కేటాయించారు. ఆయనకు మైనార్టీ సంక్షేమ శాఖతో పాటు పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ బాధ్యతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. క్రికెటర్‌గా దేశవ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించిన అజారుద్దీన్, రాజకీయాల్లోకి ప్రవేశించి గతంలో ఎంపీగా కూడా పనిచేశారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర మంత్రిగా కొత్త బాధ్యతలను స్వీకరించబోతున్నారు. ఆయనకు మైనార్టీ సంక్షేమ శాఖను కేటాయించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించిన పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖను కూడా ఆయన పర్యవేక్షించనున్నారు.

### ఒక్క అవకాశం ఇస్తే

## తెలంగాణ సర్వనాశనం

**(మొదటి పేజీ తరువాయి)**

కాంగ్రెస్‌కి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 165 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తెచ్చారని ÷ర్ అయ్యారు. ఆయనకు ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. కేసీఆర్ హయాంలో అద్భుతంగా నడిచిన పాఠశాలలు మూతపడేలాగా చేశారని ఆక్షేపించారు. హస్తం పార్టీకి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. 100 మంది గురుకుల విద్యార్థులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. ఇవాళ హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్‌ను ఆగం చేశారని విమర్శించారు. ఆయనకి ఒక్క అవకాశం ఇచ్చినందుకే.. హైడ్రా పేరుతో పేదల ఇల్లు కూలగొడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చినందుకే తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఆఖరి స్థానంలో నిలబెట్టారని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రెండోదశ ఎన్నికల ఓటరు జాబితా సవరణ

**(మొదటి పేజీ తరువాయి)**

బిహార్‌లో విజయవంతంగా పూర్తి చేసినట్లు పేర్కొన్న ఈసీ.. తాజాగా రెండో దశను ప్రారంభించినట్లు తెలిపింది. ఎస్ఐఆర్ రెండో దశలో ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఉన్నాయని ఈసీ వెల్లడించింది. 321 జిల్లాలు, 1843 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 51 కోట్ల ఓటర్లను కవర్ చేయనున్నట్లు తెలిపింది. ఎన్యూమరేషన్ ప్రక్రియ నెల పాటు డిసెంబర్ 4 వరకు కొనసాగుతుందని, అక్టోబర్ 27 వరకు ఓటరు జాబితాలో ఉన్న ప్రతి ఓటరుకు సంబంధించి పాక్షిక వివరాలు ఎన్యూమరేషన్ ఫారంలో (ఈఎఫ్) ఉంటాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్‌లో నిరసనలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో కోల్‌కతాలో భారీ స్థాయిలో నిరసన ప్రదర్శన కొనసాగింది. వచ్చే ఏడాదిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దీన్ని ఓ రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తున్నారని దీదీ ఈ సందర్భంగా ఆరోపించారు.

## జాబ్ క్యాలెండర్ తో మోసం

**ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు -నిరుద్యోగులను నిండా ముంచారు**

**జనంబాటలో జాగృతి అధ్యక్షురాలు కవిత**

ఆదిలాబాద్,**నవంబర్ 4ప్రజావినికిడి**జాబ్ క్యాలెండర్ ఇస్తామన్న హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్,అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదనితెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆదిలాబాద్‌లో మంగళవారం జరిగిన జనం బాట కార్యక్రమంలో భాగంగా జిల్లా సెంట్రల్ లైబ్రరీని సందర్శించి నిరుద్యోగులతో మాట్లాడిన ఆమె, ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులను నమ్మించి మోసం చేశారు. ఎన్నో వాగ్దానాలు చేసి ఒక్కటీ అమలు చేయలేదన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు, నియామకాలను మాత్రమే కొనసాగిస్తున్నారని ఆమె తెలిపారు. డీఎస్సీ, ఫార్మసీ, గ్రూప్స్ కోసం విద్యార్థులు కష్టపడుతున్నారు. కానీ ఎప్పుడు నోటిఫికేషన్ వస్తుందో తెలియని అనిశ్చితి నెలకొంది. ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మొన్నటి గ్రూప్-1 పరీక్షల్లో అనేక తప్పులు జరిగాయని, తెలుగు, ఉర్దూ మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని కవిత ఆరోపించారు. ఇలా కాకుండా క్వాలిటీ ఎగ్జామ్స్ నిర్వహించండి. ప్రతిపక్షాల సహకారం కూడా ఉంటుంది. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించాలని సూచించారు. ఇక్కడ లైబ్రరీలో కనీస వసతులు లేవు. మండలాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులకు మిడ్ డే మీల్స్ ఏర్పాటు చేస్తే చాలా ఉపయోగకరం. గతంలో నిజామాబాద్ లైబ్రరీలో జాగృతి తరపున విద్యార్థులకు లంచ్ ఏర్పాటు చేశాం. రాష్ట్రవ్యాప్తంగా లైబ్రరీల్లో మిడ్ డే మీల్స్ అమలు చేయాలని సూచించారు. లైబ్రరీలో కరెంట్ పోతే గంటల తరబడి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కనీసం జనరేటర్ ఏర్పాటుతో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

# 'డిజిటల్ అరెస్ట్' స్కాంలపై ఎన్పీసీఐ హెచ్చరిక

**(మొదటి పేజీ తరువాయి)**

మంగళవారం కీలక సూచనలు జారీ చేసింది. సైబర్ నేరగాళ్లు పోలీసు, సీబీఐ, కస్టమ్స్, ఆదాయ పన్ను శాఖ అధికారులమంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి డబ్బులు దోచుకుంటున్నారని హెచ్చరించింది.

**మోసం చేసే విధానం ఇదే...!**

ఈ 'డిజిటల్ అరెస్ట్' మోసంలో నేరగాళ్లు మొదట సాధారణ ఫోన్ కాల్ చేసి, ఆ తర్వాత బాధితులను నమ్మించడానికి వీడియో కాల్స్‌కు మారతారు. తాము ప్రభుత్వ అధికారులమని చెప్పి, బాధితులపై లేదా వారి కుటుంబ సభ్యులపై మనీ లాండరింగ్, డ్రగ్స్ రవాణా లేదా పన్ను ఎగవేత వంటి తీవ్రమైన కేసులు నమోదయ్యాయని బెదిరిస్తారు. తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అరెస్ట్ చేస్తామని హెచ్చరిస్తూ బాధితుల్లో భయాన్ని సృష్టిస్తారు. వీడియో కాల్స్ సమయంలో నకిలీ యూనిఫాంలు, ప్రభుత్వ లోగోలు, పోలీస్ స్టేషన్ వంటి నకిలీ నేపథ్యాలను సృష్టించి బాధితులను పూర్తిగా నమ్మిస్తారు. అంతటితో ఆగకుండా, తాము చెప్పేది నిజమేనని భ్రమింపజేసేందుకు వెనుక వైపు అధికారిక కార్యాలయాల్లో వినిపించే శబ్దాలు వచ్చేలా చూసుకుంటారు. కేసు విచారణ పూర్తయ్యే వరకు కొంత మొత్తాన్ని తమ ఖాతాకు బదిలీ చేయాలని బాధితులపై ఒత్తిడి తెస్తారు. "మీ పేరును కేసు నుంచి తొలగించడానికి", "విచారణకు సహకరించడానికి" లేదా "రిఫండబుల్ సెక్యూరిటీ డిపాజిట్" వంటి మాటలు చెప్పి మోసపూరితంగా డబ్బులు బదిలీ చేయించుకుంటారు. ఇలాంటి అనుమానాస్పద కాల్స్ వస్తే ఏమాత్రం ఆందోళన చెందవద్దని ఎన్పీసీఐ సూచించింది. ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు ఎప్పుడూ ఫోన్ లేదా వీడియో కాల్స్ ద్వారా విచారణ జరపవని, డబ్బులు డిమాండ్ చేయవని స్పష్టం చేసింది. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఇలాంటి ఆరోపణలు చేస్తే, వెంటనే కాల్ కట్ చేసి వారి వివరాలను ధృవీకరించుకోవాలని తెలిపింది. అనుమానాస్పద నంబర్ల నుంచి కాల్స్ వస్తే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి గానీ, లేదా టెలికమ్యూనికేషన్ శాఖకు చెందిన 'సంచార్ సాథి' పోర్టల్‌లో గానీ ఫిర్యాదు చేయాలని సూచించింది. మోసగాళ్లతో జరిపిన సంభాషణలకు సంబంధించిన మెసేజ్‌లు, స్క్రీన్‌షాట్‌లను భద్రపరుచుకుంటే, ఫిర్యాదు చేసేటప్పుడు అధికారులకు సాక్ష్యాలుగా ఉపయోగపడతాయని ఎన్ పీసీఐ తన ప్రకటనలో వివరించింది.

# జూబ్లీహిల్స్‌లో 30వేలతో గెలుపు

**(మొదటి పేజీ తరువాయి)**

అలాంటి పీజేఆర్ చనిపోతే.. ప్రత్యర్థిగా ఉన్న చంద్రబాబు కూడా పీజేఆర్ కుటుంబానికి మద్దతు ఇచ్చారని, కానీ కేసీఆర్ మాత్రం.. సెంటిమెంట్ లేదు.. ఏకగ్రీవం ఇచ్చేది లేదని పీజేఆర్ కుటుంబం మీద పోటీకి పెట్టారన్నారు. పీజేఆర్ కుటుంబంనీ కేసీఆర్ తన ఇంటి ముందు మూడు గంటలు కూర్చోపెట్టిన దుర్మార్గుడు కేసీఆర్ అని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా.. 'పాలేరులో రాంరెడ్డి వెంకట్ రెడ్డి చనిపోతే.. నారాయణపేట లో కృష్ణారెడ్డి చనిపోతే పోటీ పెట్టింది కేసీఆర్ కాదా.. ఆనాడు చేసిన తప్పులకు బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలి. ఆడబిడ్డ ఎవరికైనా ఆడబిడ్డనే.. నీ సొంత చెల్లెలి కి వాటా ఇవ్వాల్సి వస్తుందని చెల్లిని బయటకు పంపిన కసాయి కేటీఆర్ కాదా.. అని కెటిఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. సొంత చెల్లెల్ని బయటకు గెంటేసి నీచుడు కేటీఆర్.. మీ సొంత అన్న ఇట్లనే అవమానిస్తే.. ఊరుకుంటారా..? వేలకోట్లు కొల్లగొట్టుకున్న వ్యక్తి కేటీఆర్.. పావలా వంతు అయినా.. చెల్లికి ఇవ్వచ్చు కదా.. మహిళా సెంటిమెంట్ గురించి మాట్లాడుతున్నాడు.. ఐదేళ్లు మంత్రి పదవులు ఇవ్వకుండా అవమానించిన ది నువ్వు కాదా..? ఇందిరాగాంధీ దేశాన్ని కాంగ్రెస్ పార్టీ నీ నడపలేదా.. సోనియా గాంధీ.. ప్రియాంక గాంధీ కాంగ్రెస్ నీ నడపడం లేదా..? పదేళ్లలో ఈ పనికి మాలిన వాడు రేషన్ కార్డు ఇచ్చాడా.. ఫార్మ్ హౌస్ లో మీరు ఏమైనా వాటా అడిగారా..? రేషన్ కార్డు ఒక్కటే కదా మీరు అడిగిందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. మీతోనే నిరంతరం ఉండే నవీన్ యాదవ్ గెలిస్తే మీ వెంటే ఉండి సమస్యలు పరిష్కరిస్తాడని అన్నారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

**(మొదటి పేజీ తరువాయి)**

దీంతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతో మూడు నెలల్లోగా విచారించి నిర్ణయం వెల్లడించాలని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం జూలై 31న తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో నలుగురు ఎమ్మెల్యే విచారణను పూర్తిచేసిన స్పీకర్.. తాజాగా ఈ నెల 6 నుంచి మరో నలుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, డాక్టర్ సంజయ్ అనర్హతపై విచారణ చేపట్టనున్నారు. నవంబర్ 6న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లను విచారిస్తారు. ఈ నెల 7న పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీని విచారించనున్నారు. 12న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లపై రెండోసారి విచారణ కొనసాగనుంది.. 13న పోచారం, ఆరికెపూడి గాంధీల పిటిషన్లపై మరోసారి విచారణ నిర్వహిస్తారు. కాగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు గత నెల 31న ముగిసిన విషయం తెలిసిందే. దీంతో నాలుగు



రోజుల క్రితం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు మరో రెండు నెలల గడువు ఇవ్వాలని శాసనసభ స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టును కోరింది. నలుగురు ఎమ్మెల్యేల విచారణ మాత్రమే పూర్తయిందని.. అంతర్జాతీయ సదస్సులు ఉండటంతో గడువు సరిపోలేదని దేశ అత్యున్నత న్యాయస్థానానికి తెలిపింది.

6వ తేదీన భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ లను విచారించనున్నారు. 13న కామారెడ్డి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కేసు విచారించనున్నారు. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ నుంచి సరైన స్పందన రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానం నుంచి బీఆర్ఎస్‌కు సానుకూల తీర్పు రాకపోవడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. ఈ వ్యవహారంపై మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని జూలై 31న ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆ గడువు అక్టోబర్ 31తో ముగిసింది. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించనున్నారు.


# నక్సల్స్ కు మరో గట్టి ఎదురుదెబ్బ...

## ఆయుధ కర్మాగారాన్ని ధ్వంసం చేసిన డీఆర్‌జీ బలగాలు

ఛత్తీస్‌గఢ్**నవంబర్ 4ప్రజావినికిడి**

ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టులకు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లాలోని దట్టమైన అడవుల్లో రహస్యంగా నడుపుతున్న ఆయుధాల తయారీ కర్మాగారాన్ని డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) బలగాలు గుర్తించి ధ్వంసం చేశాయి. ఈ మెరుపుదాడిలో భారీ ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలు, యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కోయిమెంట-ఎరపల్లి ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో ఈ ఆపరేషన్ నిర్వహించారు.

కొన్ని నెలలుగా మావోయిస్టులు ఈ ఫ్యాక్టరీని అత్యంత రహస్యంగా నిర్వహిస్తున్నారు. సోలార్ ప్యానెళ్ల సహాయంతో నడిచే ఈ వర్క్‌షాప్‌లో ఆయుధాలను తయారు చేస్తున్నట్లు బలగాలు గుర్తించాయి. దాడి సమయంలో సగం తయారైన 17 నాటు తుపాకులు, బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు, పెద్ద మొత్తంలో ఉక్కు రాడ్లు,



ట్రిగ్గర్ మెకానిజమ్స్, లేత్ మెషీన్లు, వెల్డింగ్ కిట్లు, డ్రిల్లింగ్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు మందుపాతరల తయారీకి సిద్ధంగా ఉంచిన జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, సర్క్యూట్ బోర్డులను కూడా సీజ్ చేశారు. ఈ ఆపరేషన్ వివరాలను సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ మీడియాకు వెల్లడించారు. కొద్ది వారాల క్రితం లొంగిపోయిన మావోయిస్టులు ఇచ్చిన కచ్చితమైన సమాచారంతోనే ఈ స్థావరాన్ని గుర్తించగలిగామని తెలిపారు. ఆ స్థావరంలో ఆర్మీ రైఫిళ్లతో సరితూగే ఆయుధాలను తయారు చేసేందుకు సంబంధించిన బ్లూప్రింట్లను కూడా కనుగొన్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇప్పటివరకు 249 మంది నక్సలైట్లను మట్టుబెట్టినట్లు ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు వంటి అగ్రనేతలు కూడా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. "వరుస ఎదురుదెబ్బలతో బలహీనపడిన మావోయిస్టులు, ఈ ఫ్యాక్టరీ ద్వారా మళ్లీ పుంజుకోవాలని చూశారు. కానీ మేం వారి ప్రయత్నాన్ని సమాధి చేశాం" అని ఆయన స్పష్టం చేశారు. ఆపరేషన్ అనంతరం స్థావరంలోని పేలుడు పదార్థాలను సురక్షితంగా నిర్వీర్యం చేసి, మొత్తం ఫ్యాక్టరీని దగ్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న భద్రతా సిబ్బంది సురక్షితంగా తమ శిబిరానికి చేరుకున్నారు.

## ఈవీఎంలు గట్టిగా నొక్కండి... ఆ మోత ఇటలీ దాకా వినపడాలి: అమిత్ షా

బీహార్‌లో మళ్లీ 'జంగిల్ రాజ్' (అరాచక పాలన)ను ప్రజలు కోరుకోవడం లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవిల పాలనలో రాష్ట్రం అరాచకంగా మారిందని, ఆ చీకటి రోజులను ఎవరూ మర్చిపోలేరని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం పశ్చిమ చంపారన్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. "నవంబర్ 6, 11 తేదీల్లో ఈవీఎం బటన్‌ను ఎంత గట్టిగా నొక్కాలంటే, ఆ మోత ఇటలీలో ప్రతిధ్వనించాలి" అంటూ ఓటర్లకు ఆయన పిలుపునిచ్చారు. 1990లు, 2000ల ప్రారంభంలో రాష్ట్రంలో నేరాలు, అరాచకాలు పెరిగిపోయాయని గుర్తుచేసిన అమిత్ షా, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే శాంతిభద్రతలు అదుపులోకి వచ్చాయని తెలిపారు. లాలూ-రబ్రీ హయాంలోనే రాష్ట్రంలోని అనేక చక్కెర మిల్లులు మూతపడ్డాయని ఆరోపించారు. మళ్లీ ఎన్డీఏ అధికారంలోకి వస్తే, మూతపడిన అన్ని మిల్లులను తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. సోనియా గాంధీ, లాలూ ప్రసాద్ యాదవ్‌లను లక్ష్యంగా చేసుకుని అమిత్ షా విమర్శలు గుప్పించారు. "ఒక నాయకురాలు తన కొడుకును ప్రధానమంత్రిని చేయాలని చూస్తుంటే, మరో నాయకుడు తన కొడుకును ముఖ్యమంత్రిని చేయాలని ఆరాటపడుతున్నారు. కానీ ఢిల్లీలో గానీ, పాట్నాలో గానీ కుర్చీలు ఖాళీగా లేవని వారు గుర్తుంచుకోవాలి" అని ఆయన ఎద్దేవా చేశారు.

రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ, 2014 నుంచి కేంద్ర ప్రభుత్వం జాతీయ భద్రత విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటోందని, ఆర్టికల్ 370 రద్దు కూడా అందులో భాగమేనని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు కొందరు నేర చరితులను వెనకేసుకొస్తున్నాయని, అలాంటి శక్తులను ఓటర్లు తిరస్కరించాలని కోరారు. 'జీవికా దీదీ'ల (మహిళా స్వయం సహాయక బృందాలు) విషయంలో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారు ప్రభుత్వానికి ఎలాంటి డబ్బు తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అంతేకాకుండా, ప్రతి జీవికా దీదీకి అదనంగా రూ. 2 లక్షలు అందిస్తామని ప్రకటించారు.

# పాత నేరస్తులను పట్టుకున్న నాగోల్ పోలీసులు..

**ప్రజావినికిడి,(నాగోల్):**
మంగళవార రోజు అనగా తేదీ 04.11.2025 నాడు, ఇద్దరు అంతర్ రాష్ట్ర దొంగలను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుముందు హాజరు పరిచిన విషయం.

**నేరస్తుల పేర్లు వివరములు:**

1.కిన్నెర మధు తండ్రి వీరయ్య,వయస్సు:37 సం:లు,వృతి: డ్రైవర్, కులం:ఎస్.సి. మాదిగ,నివాసము: జగ్ జీవన్ రామ్ కాలనీ,చిల్కూర్ గ్రామం,మండలము, సూర్యపేట జిల్లా. స్వగ్రామము: వల్లాపురం గ్రామం నడిగూడెం మండలము, సూర్యపేట జిల్లా.

2.ఉప్పుటూరి నవీన్ కుమార్ ఏ నవీన్ తండ్రి రెడ్డమ్మ, వయస్సు 35 సం:లు, వృత్తి:మంగలిపని, కులము:నాయీ బ్రాహ్మణ,నివాసం: ఇంటి నెం.3-8-337, శ్రీనివాస నగర్ కాలనీ, లక్ష్మి హుండై షో రూమ్ ప్రక్కన,ఎల్బీనగర్ స్వగ్రామం: పరిటాలవారి పాలెం గ్రామం,సంత మణుగూరు మండలం, బాపట్ల జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.

**స్వాదీన పర్చుకున్న వస్తువులు:**

1) రెండు జతల బంగారు గాజులు,2) మూడు జతల బంగారు గాజులు,3) రెండు జతల కొత్త బంగారు గాజులు,4) ఒక రూబి చిన్న నెక్లెస్, 5)సి జెడ్ చిన్న నెక్లెస్,6) చంద్ర హరము,7) ఒక చిన్న నల్లపూసల గొలుసు,8) మరొక నల్లపూసల గొలుసు,9) 4 బంగారు ఉంగరాలు,అన్నింటి బరువు అందాజా 30 తులాలు10) 2 వెండి ప్లేట్లు బరువు అందాజా 1 కిలో,అన్నింటి విలువ అందాజ రూ" 30,00,000/-
2) నేరములో ఉపయోగించిన హొండా అక్టీవ మోటార్ సైకిల్ నెం.%ూ 08 ఖుఖ 7998,
%3) నేరస్తుని ఒప్పో సెల్ ఫోన్.

**నేర వివరములు:**

తేదీ 30-10-2025 నాడు,మధ్యాహ్నం 3:00 గంటల సమయంలో ఫిర్యాది కపిలవాయి శ్రీనివాస్ తండ్రి వెంకటేశ్వర్లు వయస్సు 59 సం:లు.. వృత్తి: ప్రైవేట్ ఉద్యోగి, నివాసం:న్యూ నల్లకుంట,హైదరబాద్ పి.ఎస్.నాగోల్ కు వచ్చి ఫిర్యాదు చేసినది ఏమనగా,తన అక్క యగు శ్రీమతి కె.ప్రమీల భర్త భాస్కర్,వయస్సు 66 సం:లు తన భర్తా పిల్లలతో కలిసి,సాయి నగర్ కాలనీ,నాగోల్ నందు స్వంత ఇంట్లో నివాసము ఉంటుందని,ఆమె తేదీ 17-09-2025 నాడు,తన భర్తతో కలిసి అమెరికా వెళ్ళినది.తదుపరి, తేదీ 30-10-2025 నాడు ఉదయం 5 గంటల సమయంలో, తన అక్క కె.ప్రమీల ఇంటి ఎదురు ఇంట్లో నివాసముండే వినోద్ అను వ్యక్తి శ్రీనివాస్ కు ఫోన్ చేసి తెలిపినది ఏమనగా,తన అక్క ఇంట్లో లైట్లు



వెలుగుతున్నాయని, వెళ్ళి చూస్తే,బెడ్ రూమ్ కిటికీ తెరిచి ఉండి,వస్తువులన్నీ చిందర వందర గా ఉన్నాయని తెలిపినాడు.వెంటనే, తను తన అక్క ఇంటికి వచ్చి చూడగా,ఇంటి తాళం వేసినది వేసినట్టుగా ఉండి, మాస్టర్ బెడ్ రూమ్ వద్ద గల కిటికీ తెరిచి ఉండి,గ్రిల్ ఊచలు వంచి ఉన్నాయి. తర్వాత ఇంట్లో పరిశీలించి చూడగా, వస్తువులన్నీ చిందర వందరగా ఉన్నాయి. తర్వాత,తన అక్క కు ఫోన్ చేయగా, బంగారు వెండి వస్తువులు తన బెడ్రూం అల్మరాలో దాచినానని తెల్పగా,అవి చూడగా,1) రెండు జతల బంగారు గాజులు,2) మూడు జతల బంగారు గాజులు,3) రెండు జతల కొత్త బంగారు గాజులు,4) ఒక రూబి చిన్న నెక్లెస్,5)సి జెడ్ చిన్న నెక్లెస్,6)చంద్ర హరము,7) ఒక చిన్న నల్లపూసల గొలుసు, 8) మరొక నల్లపూసల గొలుసు,9) 4 బంగారు ఉంగరాలు,10)2 వెండి ప్లేట్లు కనబడలేదు. తర్వాత తన అక్క ద్వారా నిర్ధారించుకొని, ఇట్టి విషయంలో తగు చర్య కోరుతూ ఫిర్యాదు చేసినాడు.

తర్వాత ఈ విషయములో కేసు నమోదు చేసుకొని, విచారణ ప్రారంబించిన నాగోల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ, డి.సి.పి.ఎల్బీనగర్ అడిషనల్ డి.సి.పి.ఎల్బీనగర్ ఏ.సి.పి.ఎల్బీనగర్ సూచనల ప్రకారం.ఈ నేరస్తలము ను నిపుణులైన క్లూస్ టీం తో పరిశీలింప చేయగా,నేరస్తలంలో అనుమానిత మూడు వెలి ముద్రాలను కనుగొన్నారు.తర్వాత క్లూస్ టీం ఇంచార్జ్ అనిల్ ఇన్స్ పెక్టర్, ఫింగర్ ప్రింట్స్, రాచకొండ వాటిని పోలీస్ రికార్డులలో పరిశోదించి చూడగా, పాత నేరస్తుడగు కిన్నెర మధు తండ్రి వీరయ్య, నివాసము:చిల్కూర్ గ్రామం అలాగే మండలము, సూర్యపేట కు చెందినవిగా గుర్తించినారు.వెంటనే ఇట్టి నేరస్తుడు ఎక్కడ ఉన్నాడని తెలుసుకొనుటకు, ప్రత్యేక బృందాలను తయారు చేసి పంపగా, వారు ఇట్టి వ్యక్తి చివరి సారి,చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ నుండి జైలుకు వెళ్ళినాడని,అంతే కాకుండా,వారెంట్ కేసులో ఆల్వాల్ పోలీస్ స్టేషన్ నుండి చెర్లపల్లి చెర్ల పల్లి జైలుకు ఆగస్ట్ -2025 లో వెళ్ళి,తేదీ 09-10-2025 నాడు జైలు నుండి బయటకు వచ్చి నాడని తెల్సింది. తర్వాత ఇట్టి వ్యక్తి, ఫోన్ ఆధారముగా, ఇట్టి వ్యక్తి ఎల్.బి. నగర్ ఏరియాలో తిరుగుతున్నడని, తెలుసుకొని,తద్వారా ఈ వ్యక్తిని గుర్తించి, నిన్న అనగా తేదీ 03.11.2025 నాడు సాయంత్రం 5 గంటల సమయంలో కిన్నెర మధు తండ్రి వీరయ్య ను అతనితో పాటు గల మరొక వ్యక్తి ఉప్పుటూరి నవీన్ కుమార్ ఏ నవీన్ తండ్రి రెడ్డమ్మ ఇద్దరినీ అదుపులోకి తీసుకొని, పి.ఎస్ కు తీసుకొని వచ్చి విచారించగా, ఇద్దరు వ్యక్తులు పై నేరము ఒప్పుకొని, దొంగిలించిన వస్తువులు,తమను పట్టుకున్న గదిలో అనగా శ్రీనివాస నగర్ కాలనీ,ఎల్బీనగర్ లో ఉన్నాయని,ఈ నేరములో పై ఇద్దరు వ్యక్తులు తిరుగుటకు ఉపయోగించిన హొండా యాక్టివా మోటార్ సైకిల్ నవీన్ కుమార్ ఏ నవీన్ కు పరిచయస్తుడైన మరొక వ్యక్తి దని,అది కూడా అట్టి రూమ్ వద్దనే ఉన్నదని, తెలిపి,తమ వెంట వస్తే,పై వస్తువులను అప్పగించ గలమని తెలిపినారు.తదుపరి, తెలుసుకొనగా, మొదటి నేరస్తుడు కిన్నెర మధు గతంలో 25కు పైబడి దొంగతనం కేసులలో,సూర్యాపేట జిల్లా,నల్లగొండ జిల్లా, సైబరాబాద్ అలాగే రాచకొండ కమీషనరేట్ లలో గల వివిద పోలీస్ స్టేషన్ల నుండి జైలుకు పోయినాడని,2018 సం:లో కోదాడ పోలీసు వారు పి.డి.చట్టం కూడా ప్రయోగించినారని, అయినా అతనిలో మార్పు రాకపోగా, నేరాలు చేస్తూ వచ్చినాడని,చివరగా చౌటుప్పల్ పి.ఎస్. నుండి 2024 సం:లో చెర్లపల్లి జైలుకు వెళ్ళగా,అప్పుడు ఆల్వాల్



పి.ఎస్.కు చెందిన మరోక కేసు ఒప్పుకోనగా,అట్టి కేసులో ఇట్టి నేరస్తుడు కోర్టుకు హాజరు కానందున,కోర్టు వారు వారెంట్ ఇవ్వగా ఇట్టి వారెంట్ పై ఆల్వాల్ పోలీసు వారు ఆగస్ట్ నెల 2025 లో పట్టుకొని చెర్లపల్లి జైలుకు పంపినారు. అతడు జైలులో ఉండగా,చైతన్యపురి పి.ఎస్.నుండి వ్యబిచార నేరములో చెర్లపల్లి జైలుకు వెళ్ళిన ఉప్పుటూరి నవీన్ కుమార్ ఏ నవీన్ తండ్రి రెడ్డమ్మ, కిన్నెర మధుకు పరిచయం అవ్వగా, అట్టి పరిచయం తో ఇద్దరు కలిసి, దొంగతనములు చేసి సులువుగా డబ్బు సంపాదించ వచ్చుని నిర్ణయించుకున్నారు. తదుపరి,మధు తేదీ 09-10-2025 నాడు జైలు నుండి బెయిలు పై బయటకు రాగా, నవీన్ కుమార్ ఏ నవీన్ తేదీ 15-10-2025 నాడు జైలు నుండి బయటకు వచ్చినాడు.తర్వాత ఇద్దరు కలిసి, 25-10-2025 నాడు కలుసుకొని,గత 4 రోజులుగా,నవీన్ కుమార్ ఏ నవీన్ యొక్క మిత్రుని మోటార్ సైకిల్ పై నాగోల్,ఎల్బీనగర్ ఏరియాలో తిరుగుతూ,తాళం వేసిన ఇండ్లను ఇద్దరు వెతుకుచుండగా,తేదీ 29-10-2025 నాడు, ప్రమీల యొక్క ఇంటిని గుర్తించి,అదే రోజు అర్ధరాత్రి,వారి పథకం ప్రకారం మధు,నవీన్ లు ఇద్దరు సాయి నగర్ కు మోటార్ సైకిల్ పై వెళ్ళగానే,మధు,నవీన్ ను రూమ్ కు పంపించి,తాను ఇట్టి ఇంట్లోకి దొంగతనమునకు తన వెంట తెచ్చుకున్న రాడ్ తో వెళ్ళి,కిటికీ ని,దాని గ్రిల్ ను రాడ్ తో వంచి,లోనికి ప్రవేశించి,ఆ బెడ్ రూమ్ లో గల అల్మరా తెరిచి,అందులో దాచిన బంగారు వెండి వస్తువులు దొంగిలించుకొని వెళ్ళి పోయినాడు.తర్వాత, నేరుగా ఇట్టి ఎల్బీనగర్ లో గల రూమ్ కు వెళ్ళిన మధు,ఈ దొంగిలించిన వస్తువులలో కొద్దిపాటి వస్తువులు నవీన్ కు ఇచ్చి,మిగితావి తనవద్ద పెట్టుకొని అమ్ముకుందామని చూస్తున్నారు.ఇంతలో నాగోల్ పోలీసువారు చాక చక్యంగా పట్టుకొని,పై దొంగిలించిన బంగారు వెండి వస్తువులను స్వాదీన పర్చుకున్నారు.

**పోలీసువారి సూచన:**

ఇట్టి నేరం లో పాత నేరస్తుల సేకరించిన వెలి ముద్రలు ప్రత్యేక సూచనగా ఉన్న కారణముగా,ఈ కేసును సునాయాసంగా ఛేదించ గలిగినాము. అలాగే సిసిటివి కెమెరా లలో వచ్చిన వీడియో ల ద్వారా కూడా పాత నేరస్తున్ని పోలీసులు గుర్తించ గలిగినారు.

**ప్రశంస:**

ఇట్టి నేర పరిశోధనను పర్యవేక్షించిన శ్రీమతి అనురాధ ఐ.పి.ఎస్. డి.సి.పి,ఎల్బీనగర్ కోటేశ్వర రావు, అడిషనల్ డి.సి.పి.ఎల్బీనగర్ ఏ. కృష్ణయ్య ఏ.సి.పి. ఎల్బీనగర్ ను,అలాగే చాకచక్యంగా వ్యవహరించిన ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ,ఎస్.ఐ. లు పి.శివనాగ ప్రసాద్, ఎస్.నర్సింహా (డిఎస్ఐ),ఏ.ఎస్.ఐ. కె. రవి యాదవ్,క్రైమ్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ శర్ఫుద్దీన్, కానిస్టేబుళ్లు కె. సుభాష్,జె.సాయిష్, శ్రీకాంత్ యాదవ్,నరేశ్ కుమార్,డబ్లుపిసి హిమబిందు లను రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు ప్రశంసించారు.

# నవీన్ యాదవ్‌మంచి మెజార్టీతో
# జూబ్లీహిల్స్ లో గెలవబోతున్నాం..

## మంత్రి పొంగులేటి సమక్షంలో భారీ ఎత్తున కాంగ్రెస్‌లో చేరికలు..

**ప్రజావినికిడి,(జూబ్లీహిల్స్):**
మంచి మెజార్టీతో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించబోతుందని రాష్ట్ర రెవెన్యూ ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, రెహమత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రెహ్మత్‌నగర్ డివిజన్‌లోని ఓమ్ నగర్ చర్చి కమిటీ సభ్యులు,వివిధ పార్టీల నాయకులు మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో రోడ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి మంత్రిగారు స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో గడచిన 23 నెలల్లో చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలే కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని చేకూర్చిపెడతాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధి నవీన్ యాదవ్‌కు మంచి మెజార్టీతో విజయం తధ్యమని అన్నారు.ఇప్పటికే ఈ డివిజన్‌లో పెద్ద ఎత్తున వివిధ పార్టీలకు చెందిన



కార్యకర్తలు, నాయకులు,ఆటో యూనియన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరారని అన్నారు. త్వరలో మరికొంతమంది కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని అన్నారు.
పదేళ్లలో జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో ఒక్క రేషన్ కార్డుకూడా ఇవ్వలేని బి ఆర్ ఎస్ పార్టీ నాయకులకు ఓట్లు అడిగే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. 22 నెలల్లోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అర్హులైన 14వేల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చామని,అలాగే సుమారు 8వేల మంది పేర్లను కార్డులలో చేర్పించామని అన్నారు.

# ఈనెల 4,5,6తేదీలలో
# క్రీస్తు రెండవ రాకడ సిద్ధబాటు సభలు

**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
మనసురాబాద్ పరిధి బేతేస్థ కాలనీ లోని రోడ్ నెంబర్ 2లో గల కల్వరి మహిమ మందిరం సంఘ సభ్యులు రెవరెండ్ ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో మరనాత క్రీస్తు రెండవ రాకడ సిద్ధబాటు సభలు ఈనెల 4,5,6 తేదీలలో నిర్వహిస్తున్నారు.ఈ సభలకు వాక్యోపదేశకులుగా హైదరాబాద్ బైబిల్ మిషన్ గవర్నింగ్ బాడీ సభ్యులు రెవరెండ్ సిహెచ్ షాలేం శరత్, కాకినాడ బైబిల్ మిషన్ రెవరెండ్ ఎన్.జోసఫ్ సామ్యూల్,జగ్గంపేట బైబిల్ మిషన్ రేవరెండ్ కె.రాజ్ కిషోర్ పాల్గొనబోతున్నారు. ఈ సందర్భంగా రెవరెండ్ ఎస్. సత్యప్రసాద్ మాట్లాడుతూ,గత పదేళ్ల నుండి ఈ సభలను ఇక్కడ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ మూడు



రోజులు జరగబోయే సభలకు పెద్ద ఎత్తున దైవజనులు,దైవ సేవకులు,విశ్వాసులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అట్లాగే ప్రేమ విందు కూడా ఉంటుందని తెలిపారు.మరిన్ని వివరాల కొరకు 9666108943 నెంబర్ కు సంప్రదించాల్సిందిగా సూచించారు.

# బిజెపి, -బిఆర్ఎస్‌ల మధ్య ఫెవికాల్ బంధం

హైదరాబాద్ : **నవంబర్ 4ప్రజావినికిడి**
బిజెపి, -బిఆర్ఎస్‌ల మధ్య ఫెవికాల్ బంధం లేకపోతే 11వ తేదీలోగా బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్‌ను, ఆ పార్టీ ఎంఎల్ఎ హరీష్‌రావును కాళేశ్వరం అవినీతి కేసులో సిబిఐతో ఎఫ్ఐఆర్ నమోదు చేయించి అరెస్టు చేయించాలని సిఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సవాల్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నే పథ్యంలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెహమత్ నగర్ లో భారీ రోడ్డు-షో నిర్వహించారు. ఈ రోడ్-షోలో రాష్ట్ర మంత్రులు కో మటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజహరుద్దీన్, పిసి సి చీఫ్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలనుద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ బిఆర్ఎస్-బిజెపిల బంధాన్ని తూర్పార బట్టారు. ఆ రెండు పార్టీల నేతలు ప గలు కొట్లాడుకుంటారని, రాత్రి అలయ్-



బలయ్ అంటారని అ న్నారు. కారు గుర్తు పార్టీని గెలిపిస్తే, ఆ కారు ఢిల్లీ వెళ్ళగానే కమలం పవ్వుగా మారిపోతుందని ఆయన తూర్పారబట్టారు. కాళేశ్వరం ప్రా జెక్టు అవినీతి విషయంలో తాము అసెంబ్లీలో చర్చించి అందరి ఆమోదంతో సిబిఐ విచారణకు కోరుతూ తీర్మానం ఆమోదిచామన్నారు. అయితే ఈ అవినీతి విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ సిబిఐ విచారణకు ఆదేశిస్తే నలభై ఎనిమిది గంటల్లో అరెస్టు చేయించి చర్లపల్లి, చంచల్‌గుడా జైలుకు పంపిస్తామని అన్నారని ఆయన గుర్తు చేశారు. నలభై ఎనిమిది గంటలు కాదు కదా వంద రోజులైందన్నారు. అయినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు. ఫార్ములా ఈ-కార్ల కేసులో కెటిఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ప్రశ్నించారు.అవినీతి కేసులో అరెస్టు చేసేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా తాము గవర్నర్‌ను కోరితే ఇంత వరకు అనుమతి రాలేదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హెూం మంత్రి అమీత్ షా ఎందుకు మాట్లాడడం లేదన్నారు. త్రిబుల్ తలాఖ్ వంటి ఏ నిర్ణయాన్ని కేంద్రం తీసుకున్నా కెసిఆర్ మద్దతునిస్తున్నందుకే వారు అండగా ఉంటున్నారని ఆయన విమర్శించారు.

# ఆంజనేయ మండల దీక్షలు



**ప్రజావినికిడి, (వాజేడు):**పూసూరు గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి అలయం వద్ద అంజన్న స్వాములు మండల దీక్షలు నిర్వహించారు శ్రీ ఆంజనేయ స్వామి వారి సన్నిధిలో స్వామి వారి మాల ధారణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో అంజన్న స్వాములు భక్తులు,కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## మండల విద్యాశాఖ
# ఓరియెంటేషన్ కార్యక్రమం





**ప్రజావినికిడి,(వాజేడు):నవంబర్,5,**
విద్యశాఖ అద్వర్యంలో యుడిసీ ప్లేస్ ఓరియెంటేషన్ కార్యక్రమం జడ్పిహెచ్ఎస్ వాజేడు నాగారం పాఠశాల నందు నిర్వహించడం జరిగింది.ఈ సందర్బంగా వాజేడు మండల విద్యాశాఖ అధికారి టి వెంకటేశ్వరరావు మాట్లాడుతు.వాజేడు మండలంలో ఉన్నటువంటి అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలలో ఉన్నటువంటి మౌలిక సదుపాయాలు,టీచర్లు విద్యార్థుల వివరాలను ఎటువంటి తప్పులు లేకుండా సరైన డేటాను ఇవ్వాలని సూచించారు.పాఠశాలలో ఉన్నటువంటి ప్రతి విద్యార్థి యుడిసీ ప్లేస్, లో నమోదు చేయాలని సూచించారు.డిఎస్ఈ, ఎఫ్ఆర్ఎస్,టీచర్లు విద్యార్థుల అటెండెన్స్ 100% నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించడం జరిగింది.ఆధార్ లేని విద్యార్థులకు బైయోట్రాన్సీ అనే ఏజెన్సీ ద్వారా ఉచితంగా ఆధార్ దింపడం జరుగుతుందని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఎస్ ఆనందరావు,స్ట్రాంగ్ టీచర్ బి. జయేంద్రరావు, ప్రధానోపాధ్యాయులు, మిస్కో నరేష్,సిఆర్పి లు వెంకటేశ్వర్లు,శ్రీను పాల్గొన్నారు.

# పీజీ బాలికల హాస్టళ్లలో సమగ్ర ఆడిట్ కార్యక్రమం






**ప్రజావినికిడి ,(ఎల్బీనగర్):** రాచకొండ మహిళా భద్రతా విభాగం, షి టీమ్ బృందాలు, రాచకొండ భద్రతా మండలితో సమన్వయంతో, చైర్మన్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి.సుధీర్ బాబు ఐపీఎస్ నాయకత్వం మార్గదర్శకత్వంలో 'స్టే సేఫ్'చొరవ కింద సరూర్‌నగర్ ప్రాంతంలోని పీజీ బాలికల హాస్టళ్లలో సమగ్ర ఆడిట్ నిర్వహించాయి.ఈ సౌకర్యాలలో నివసించే మహిళల భద్రత అలాగే భద్రతను నిర్ధారించడానికి ఈ సమగ్ర వ్యాయామం చేపట్టబడింది.ఆహార పరిశుభ్రత,శిక్షణ పొందిన వాచ్‌మెన్ ఉనికి,అగ్నిమాపక భద్రతా నిబంధనలకు కట్టుబడి ఉండటం,సి సిటివి కెమెరాల పని పరిస్థితి మరియు క్రియాత్మక ప్రథమ చికిత్స కిట్ లభ్యత వంటి అన్ని కీలకమైన భద్రత అలాగే కార్యాచరణ పారామితులను బృందాలు నిశితంగా తనిఖీ చేశాయి. మహిళలకు సురక్షితమైన అదేవిధంగా భద్రమైన వాతావరణాన్ని సృష్టించడంలో కౌన్సిల్ యొక్క నిబద్ధతను ఈ చురుకైన చర్య పునరుద్ఘాటిస్తుంది.

# సిగాచీ ఉల్లంఘనలపై హైకోర్టులో కేసు
## కోటి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారన్న కోర్టు



హైదరాబాద్,**నవంబర్ 4ప్రజావినికిడి** సిగాచీ పరిశ్రమలో పేలుళ్ల ఘటనపై కలపాల బాబూరావు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. సిగాచీ పేలుడు ఘటనలో 54 మంది మృతి చెందారని, ప్రమాదం జరిగి నాలుగు నెలలు గడిచినా ఇప్పటి వరకు ఎవరినీ అరెస్టు చేయలేదని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. బాధితులకు ఇస్తామన్న రూ.కోటి పరిహారం కూడా ఇవ్వలేదని, ఎన్నో ఉల్లంఘనలు జరిగినట్టు దర్యాప్తులో తేలిందని వివరించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారంలోని సిగాచీ కంపెనీ ఎండీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మృతులు, బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లింపులో కౌంటరు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం రెండు వారాలకు వాయిదా వేసింది. నిపుణుల కమిటీ నివేదికను విశ్లేషిస్తున్నామని అదనపు అడ్వొకేట్ జనర్ రజనీకాంత్ తెలిపారు. 192 మంది ప్రత్యక్ష సాక్షుల నుంచి పోలీసులు వాంగ్మూలం సేకరించారు. సిగాచీ కంపెనీకి చెందిన వైస్ ప్రెసిడెంట్ సైతం ప్రమాదంలో చనిపోయారు. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా పోలీసులు చర్యలు తీసుకోనున్నారు' అని కోర్టుకు తెలిపారు. బాధితులకు రూ.కోటి పరిహారం ఎప్పుడు చెల్లిస్తారని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు చెల్లించామని, కంపెనీ నుంచి మిగతా డబ్బులు వచ్చేలా చూస్తున్నామని ఏఏజీ వివరణ ఇచ్చారు. రెండు వారాల్లో సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఏఏజీని హైకోర్టు ఆదేశించింది.

## అండర్13 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ టోర్నమెంట్ లో
# ప్రతిభ చాటిన మ్యాచ్‌పాయింట్ అకాడమీ




**ప్రజావినికిడి,(హైదరాబాద్):**
అండర్ 13 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో బాలికల సింగిల్స్ విభాగంలో అద్భుతమైన ఆటతీరుతో ఆధిక కృషికా రెడ్డి మెయిన్ డ్రాకు అర్హత సాధించింది.తుదిపోరులో విశాఖ జిల్లాకు చెందిన ఉజ్వల రాణిపై 30-12 స్కోర్‌తో విజయం సాధించి మెయిన్ డ్రాలో చోటు దక్కించుకుంది.అలాగే బాలుర సింగిల్స్ విభాగంలో ఏడేళ్ల ఆధిక ధ్రువాన్ష్ రెడ్డి మూడవ రౌండ్‌లో 30-27 స్కోర్‌తో అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించి పోరాడినప్పటికీ, కొద్దిలో మెయిన్ డ్రా అవకాశాన్ని కోల్పోయాడు. వీరిద్దరూ అక్కా%-%తమ్ముళ్లు కావడం విశేషం. నాలుగేళ్ల చిన్న వయసులోనే మ్యాచ్‌పాయింట్ అకాడమీలో శిక్షణ ప్రారంభించిన వీరు, క్రమశిక్షణతో కూడిన ఆటతీరుతో అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ధ్రువాన్ష్ లో ఆటపై ఉన్న ఆసక్తి, అంకితభావం చూసి ప్రధాన కోచ్ వేణు ముప్పాల ప్రత్యేక శ్రద్ధతో శిక్షణ అందిస్తున్నారు.అంచెలు అంచెలుగా తన ఆటతీరుతో అందరినీ ముగ్ధుల్ని చేస్తూ ముందుకు సాగుతున్నాడు ధ్రువాన్ష్ రెడ్డి తల్లితండ్రులైన మంజునాథ్ రెడ్డి,ప్రగ్న తమ పిల్లలు బ్యాడ్మింటన్ పట్ల ఉన్న ఆసక్తిని గుర్తించి, విద్యతో పాటు క్రీడలోను సమతుల్యత సాధించేందుకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండుపూటలా మ్యాచ్‌పాయింట్ అకాడమీకి తీసుకువెళు_న్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,పిల్లల్లో క్రమశిక్షణ,పట్టుదల, క్రీడాస్ఫూర్తి పెరగడానికి మ్యాచ్‌పాయింట్ అకాడమీ ఎంతో సహకరించింది.కోచ్ వేణు ముప్పాల వ్యక్తిగత శ్రద్ధ,పిల్లల మనోభావాలను అర్థం చేసుకుని ఇచ్చే శిక్షణ చూసి మేము చాలా ఆనందిస్తున్నాం.పిల్లల క్రీడా ప్రయాణం ఇంకా ముందుకు సాగి రాష్ట్ర, జాతీయ స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధిస్తారని మేము నమ్ముతున్నాం అని అన్నారు.అనంతరం మ్యాచ్‌పాయింట్ ఫౌండర్ ఛైర్మన్ వేణు ముప్పాల మాట్లాడుతూ, త్వరలో జరగబోయే ఏపీ స్టేట్ అండర్ 11 టోర్నమెంట్‌లో ధ్రువాంశ్ అద్భుతంగా ఆడి బంగారు పతకం సాధించాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నానని అన్నారు.మ్యాచ్‌పాయింట్ అకాడమీలో ప్రస్తుతం 200 మంది పిల్లలు బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందుతున్నారని అనుభవజ్ఞులైన ఎన్ఐఎస్ సర్టిఫైడ్ కోచ్‌లు శిక్షణ అందిస్తున్నారని ఉదయం,సాయంత్రం తక్కువ ఫీజుతో శిక్షణ అందిస్తున్న మా అకాడమీకి అల్‌కాపూర్,మనికొండ ప్రాంత ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.లాభాపేక్ష లేకుండా సేవా దృక్పథంతో మంచి క్రీడాకారులను దేశానికి అందించడం మా లక్ష్యం అని వేణు ముప్పాల తెలిపారు.

## జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు
# 350 ప్రైవేట్ పాఠశాలల టీచర్ల మద్దతు..







**ప్రజావినికిడి,(జూబ్లీహిల్స్):**
ఈనెల 11నజరగబోయే జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్ యాదవ్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి కృషీ చేస్తామని గ్రేటర్ హైదరాబాద్ ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల కరస్పాండెంట్ అసోసియేషన్ (GHPRSCA) ప్రతినిధులు తెలిపారు. మంగళవారం జూబ్లీహిల్స్ లోని జూబ్లీ కన్వెన్షన్ హాల్ లో అసోసియేషన్ ప్రతినిధులు తమ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో 350 ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు పాల్గొన్నారు.గ్రేటర్ హైదరాబాద్ ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల కరస్పాండెంట్ అసోసియేషన్ (%+నూ=నాజూ%) ప్రతినిధులు బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వానికి మెమోరాండం సమర్పించారు.ఈ సందర్భంగా వారు జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు తమ మద్దతు తెలిపారు.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఏఐసీసీ సెంట్రల్ మెంబర్ అలాగే తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ విశ్వనాథ్ పాల్గొని.. అసోసియేషన్ ప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలను సావధానంగా విన్నారు..వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వారికి భరోసా ఇచ్చారు.ట్రేడ్ లైసెన్స్, ప్రొఫెషనల్ ట్యాక్స్ మినహాయింపు, విద్యుత్,నీటి బిల్లులను కమర్షియల్ నుంచి డొమెస్టిక్ కనెక్షన్ల కింద మార్చడం,ఈటిఆర్ గడువును 10 నుంచి 20 సంవత్సరాలకు పెంచడం,2009 తర్వాత స్థాపించబడిన పాఠశాలలకు ఫైర్ ఎన్ ఓ సి మినహాయింపు, సబ్సిడీ రుణాలు, సబ్సిడీ రేట్లలో పాఠ్యపుస్తకాల సరఫరా వంటి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో జి ఎచ్ పిఆర్ఎస్ సిఎ అధ్యక్షుడు జితేందర్ కుమార్, కార్యదర్శి ప్రణయ్ కుమార్ యాదవ్,వసీం ఉన్నిస్సా,ఆది నారాయణతదితరులు పాల్గొన్నారు.

# రీయింబర్స్‌మెంట్‌పై అధ్యయన కమిటీ



హైదరాబాద్ :**నవంబర్ 4ప్రజావినికిడి**
రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంపై అధ్యయనానికి ప్ర భుత్వం కమిటీ ఏర్పాటు చే సింది. ఈ మేరకు మంగళవారం సిఎస్ కె. రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. సంక్షేమశాఖ స్పెషల్ సిఎస్ ఛైర్మన్‌గా, ప్రొ ఫెసర్ కంచ ఐలయ్య, కోదండ రాం, ఆర్థి క, విద్య, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ సంక్షేమశాఖల కార్యదర్శులు, ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌తో పాటు ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్(ఫతి) నుంచి ముగ్గురు ప్రతినిధులను కమిటీలో సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. ఫీజు రీ యింబర్స్‌మెంట్ పాలసీపై కమిటీ.. ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనుంది. ప్రత్యేక ట్రస్ట్ ద్వారా ఫీ జు రీయింబర్స్‌మెంట్ సాధ్యాసాధ్యాలను కమిటీ పరిశీలించనుంది. 3 నెలల్లో కమిటీ నివేదిక ఇ వ్వాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. విద్యా సంస్థలు పేర్కొన్న సూచనలపై కూడా కమిటీ అధ్యయనం చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పే ర్కొంది. కాగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ ప్రైవేట్ వృత్తి వి ద్య, డిగ్రీ కాలేజీలు చేపట్టిన బంద్ రెండో రోజు కొనసాగింది. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెం ట్ నిధులు విడుదల చేసే వరకూ కొనసాగించనున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్(ఫతి) నాయకులు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాల నిరసనలో భాగంగా ఈ నెల 8న ఎల్.బి.స్టేడియంలో మంది అధ్యాపకులు, కళాశాలల సిబ్బందితో సమావేశం నిర్వహించనున్నట్లు ఫెడరేషన్ నాయకులు తెలిపారు. అలాగే ఈ నెల 11న 10 లక్షల మంది విద్యార్థులతో హైదరాబాద్‌లో లాంగ్ మార్చ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో దాదాపు 2,500 ప్రైవేట్ విద్యాసంస్థలు ఉన్నాయని ఈ బంద్‌లో పాల్గొన్నట్లు ఫెడరేషన్ నాయకులు తెలిపారు. వీటిలో ఇంజనీరింగ్, ఫార్మసీ, లా, బి.ఎడ్, ఎంబిఎ, ఎంసిఎ, నర్సింగ్, ఇతర ప్రొఫెషనల్ కాలేజీలు ఉన్నాయని అన్నారు. ఫార్మసీ పరీక్షలకు తక్కువగా హాజరు నమోదు బి. ఫార్మసీ మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అయితే ఈ పరీక్షలకు 12 శాతం మాత్రమే హాజరు నమోదైంది. జెఎన్‌టియుహెచ్ పరిధిలో 9 కాలేజీలు పరీక్షలు నిర్వహించగా, 52 కాలేజీలు పరీక్షలను బహిష్కరించినట్లు ప్రైవేట్ యాజమాన్యాలు తెలిపాయి. కాగా, కొన్ని కాలేజీలు షెడ్యూల్ ప్రకారం విద్యార్థులను పరీక్ష రాయడానికి అనుమతించలేదని తెలిసింది. చర్చనీయాంశంగా కమిటీని ఏర్పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ ప్రైవేట్ కాలేజీలు బంద్ పాటిస్తుండగా, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి సంస్కరణలపై కమిటీని ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఒకపక్క ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. వాయిదాల రూపంలో బకాయిలు చెల్లిస్తామంటూ కాలేజీల యాజమాన్యానికి ప్రభుత్వం ప్రతిపాదిస్తుంది. తమకు హామీ ఇచ్చిన మేరకు నిధులు విడుదల చేస్తే తమ నిరసనను విరమిస్తామని యాజామాన్యాలు ప్రభుత్వానికి తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యం, ప్రభుత్వానికి మధ్య దూరం పెరుగుతోంది.

# పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే మందు బంద్



హైదరాబాద్ :**నవంబర్ 4ప్రజావినికిడి** రాష్ట్ర ప్రభుత్వానికి లిక్కర్ కంపెనీ లు మరోసారి అల్టిమేటం జారీ చేశాయి. పెండింగ్ బకాయిలను చె ల్లించకపోతే లిక్కర్ ఉత్పత్తి ఆపేస్తామని హెచ్చరించాయి. తక్షణమే బకాయిలు విడుదల చేయకపోతే డిసెంబర్‌లో మద్యం కొరత, ఆర్థిక విపత్తు తప్పదని లిక్కర్, బేవరేజెస్ కంపెనీల సంఘం ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చింది. ప్రభుత్వం నుంచి రూ.3,366 కోట్ల బకాయిలు రాకపోవడంతో ఆర్థిక సమస్యలతో మద్యం తయారీ కంపెనీలు ఇబ్బంది పడుతున్నట్లుగా పేర్కొంది. బిల్లులు చెల్లించకుంటే మద్యం ఉత్పత్తిని నిలిపివేయడం తప్ప మరో మార్గం లేదని కంపెనీల సంఘం స్పష్టం చేసింది. ఈ బకాయిల్లో రూ.2,300 కోట్లకు పైగా గత ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం ఈ ప్రభుత్వం రూ.1,366 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. గత ప్రభుత్వం చెల్లింపులు చేయకపోవడంతో సరఫరా సంస్థలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. దీంతోపాటు తాత్కాలికంగా అడ్వాన్స్ ఎక్సైజ్ డ్యూటీని 30 శాతం నుంచి ఒక శాతానికి తగ్గించాలని విజ్ఞప్తి చేశాయి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# నైజీరియాలో క్రైస్తవులపై మారణహోమం

## ఇలాగే సాగితే జోక్యం చేసుకోక తప్పదు -నైజీరియా ప్రభుత్వానికి ట్రంప్ హెచ్చరికలు



వాషింగ్టన్,**నవంబర్ 4ప్రజావినికిడి**
నైజీరియాలో దాడులకు అమెరికా సిద్ధపడుతుందనే అనుమానాలు బలపడుతున్నాయి. అక్కడి వనరులపై ట్రంప్ కన్నుపడిందన్న ప్రచారం సాగుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా ట్రూత్‌లో నైజీరియా ప్రభుత్వం క్రైస్తవులను చంపడానికి అనుమతిస్తూనే ఉంది. అక్కడి ఇస్లామిక్ మిలిటెంట్ గ్రూపులు క్రిస్టియన్లపై దాడులు చేస్తున్నాయి. అమెరికా వెంటనే అన్ని సహాయాలను నిలిపేస్తుంది. ఇప్పుడు అమెరికా సైన్యం ఆ దేశంలోకి వెళ్లి ఇస్లామిక్ ఉగ్రవాదులను పూర్తిగా తుడిచిపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో నైజీరియా ఉలిక్కిపడింది. ఆఫ్రికా ఖండంలో 230 మిలియన్ల అత్యంత జనాభా కలిగిన దేశం నైజీరియా. ఈ జనాబాలో ముస్లింలు, క్రైస్తువులు దాదాపుగా సమానంగా ఉన్నారు. సాయుధ గ్రూపుల ఘర్షణలో అనేక మంది ముస్లిములు అధిక సంఖ్యలో మృతి చెందారు. బొకోహారం వంటి ఉగ్రవాద ముఠాల వల్ల అన్ని మతాలవారు మరణిస్తున్నారు. క్రైస్తవులే లక్ష్యం అనేదానికి స్పష్టమైన ఆధారాలు లేకున్నా, క్రైస్తవులు కూడా మరణిస్తున్నారు. నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు ట్రంప్ వ్యాఖ్యలను తిరస్కరించారు. తమ దేశంపై మత పరంగా అసహనం వ్యక్తం చేయడం సరికాదన్నారు. తమ ప్రభుత్వం నైజీరియన్లకు మతపరమైన స్వేచ్ఛ కోసం, వారి విశ్వాసాలను కాపాడటానికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. పౌరులకు భద్రతను ప్రభుత్వం కల్పిస్తుందని, తీవ్రవాద అంతానికి అమెరికాతో సహా అంతర్జాతీయంగా కలిసి పనిచేస్తామని వెల్లడించారు. నైజీరియాలో సామూహికంగా క్రైస్తవులను హత్యలు చేస్తున్నందున మత స్వేచ్ఛను ఉల్లంఘించే దేశంగా గుర్తించాలని అమెరికా సెనేటర్ టెడ్ క్రూజ్ గత వారం కాంగ్రెస్‌లో ప్రకటించిన తరువాత ట్రంప్ ఈ బెదిరింపులకు చేయడం గమనార్హం. ట్రంప్ ఉద్దేశం వేరని, రక్షణ సాంకేతికత, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహకాల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్, రాగి, లాందనం, నియోడైమియం, ప్రసోడైమియం వంటి కీలక ఖనిజ నిక్షేపాలు నైజీరియాలో ఉన్నాయని వాటి కోసమే ట్రంప్ బెదిరింపులని పలువురు విశ్లేషిస్తున్నారు.

# మణికొండలో కాల్పుల కలకలం

## అల్లుడి స్వాధీనంలోని స్థలం ఖాళీ చేయించేందుకు ఒత్తిడి

### ఈ సందర్భంగా మాజీమంత్రి కెఇ ప్రభాకర్ కాల్పులు ?





హైదరాబాద్,**నవంబర్ 4ప్రజావినికిడి**
మణికొండ పంచవటి కాలనీలో మంగళవారం తుపాకీ కాల్పులు కలకలం సృష్టించాయి. ఎపికి చెందిన మాజీమంత్రి ప్రభాకర్ ఓ స్థల వివాదంలో గాల్లోకి కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. మణికొండ పంచవటి కాలనీలో తన స్థలాన్నీ ఖాళీ చేయాలని బాధితులను ప్రభాకర్ బెదిరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో తుపాకీతో గాల్లోకి ప్రభాకర్ మూడు రౌండ్లు కాల్పులు జరిపినట్లు వార్తలు వస్తున్నాయి. బాధితులను స్థలంలో నుంచి బయటకు గెంటేసి గేటుకి ప్రభాకర్ అనుచరులు తాళాలు వేసినట్లు తెలుస్తోంది. అయితే, రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

హైదరాబాద్ రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో కాల్పులకు సంబంధించి కీలక విషయాలు బయటకొచ్చాయి. కేఈ ప్రభాకర్, పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ కుటుంబాల మధ్య రచ్చ కారణంగా ఈ గొడవ జరిగినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. కేఈ కృష్ణమూర్తి సోదరుడు కేఈ ప్రభాకర్ కుమార్తెకు, నందీశ్వర్‌గౌడ్ పెద్ద కుమారుడు అభిషేక్ గౌడ్‌కు చాలాకాలం కిందట పెళ్లి జరిగింది. ఆ దంపతుల మధ్య కొంతకాలంగా విభేదాలు నడుస్తున్నాయి. ఈ గొడవల కారణంగా వారు విడాకులు తీసుకోవాలని కూడా నిర్ణయించుకున్నారు. దీంతో తన కుమార్తెకు కట్నంగా ఇచ్చిన ప్లాట్ ఖాళీ చేయాలని అల్లుడు నందీశ్వర్ గౌడ్‌పై కేఈ ప్రభాకర్ ఒత్తిడికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో కేఈ ప్రభాకర్‌ను అభిషేక్ గౌడ్ గన్‌తో బెదిరించారు. తుపాకీతో గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపినట్లు సమాచారం.
ఈ బెదిరింపులపై అక్టోబర్ 25వ తేదీన రాయదుర్గం పోలీసులకు కేఈ ప్రభాకర్ ఫిర్యాదు చేశారు. అప్పట్నుంచి అభిషేక్ గౌడ్ కోసం పోలీసులు వెతుకుతున్నారు. ఈ క్రమంలో మణికొండలోని పంచవటి కాలనీలో అభిషేక్ గౌడ్ నివాసానికి వెళ్లిన పోలీసులు వెపన్ కోసం సెర్చ్ చేస్తున్నారు.

# బీహార్‌లోనూ ఉచిత పథకాల వెల్లువ

**సంక్రాంతి కానుకగా మహిళల ఖాతాల్లో 30వేలు జమ**

**మద్దతు ధరలకు అదనంగా 300,400 చెల్లింపులు**

**సొంతూరికి 70 కి.మీ దూరంలోనే ఉద్యోగుల బదిలీలు**

**మీడియా సమావేశంలో ఆర్‌జెడి నేత తేజస్వీయాదవ్**



పాట్నా,**నవంబర్ 4ప్రజావినికిడి** బీహార్ ఎన్నికల తరుణంలో ఆర్‌జెడి నేత, మహాగట్బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలో నిలిచిన తేజస్వియాదవ్ ప్రజలకు వరాల జల్లు కురిపించారు. ముఖ్యంగా రైతులు పండించిన వరి గోధుమలకు ఎంఎస్‌పి ధర కంటే అదనపంగా క్వింటాలకు రూ. 300, 400 చొప్పున చెల్లించనున్నట్లు హామీనిచ్చారు. మహిళల బ్యాంకు ఖాతాలో 30 వేల చొప్పున జమ చేస్తామని, ప్రభుత్వ
ఉద్యోగులైన పోలీసులు, టీచర్లు, ఆరోగ్య కార్యక్తల బదిలీలు వారి సొంత ఇంటికి 70 కిలోమీటర్లలోపే బదిలీలు ఉంటాయని ప్రకటించారు. ఇప్పటికే ఇంటికో ఉద్యోగం ప్రకటించిన తేజస్వీ ఎన్‌డిఎ కూటమిని దెబ్బతీసేందుకు అలవికాని హామీలు ఇస్తున్నారు. తాజాగా బిహార్ ఎన్నికల్లో మహిళా ఓటర్లను
ఆకట్టుకునేందుకు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కీలక హామీ ప్రకటించారు. మంగళవారం తేజస్వియాదవ్ పాట్నాలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఇండియా కూటమి బిహార్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన వెంటనే 'మై-బహిన్ మాన్ యోజన'ను ప్రారంభిస్తామన్నారు. ఇందులోభాగంగా జనవరి 14న సంక్రాంతి రోజున రాష్ట్రంలోని మహిళలకు ఏడాదికి రూ.30వేలు కానుకగా అందచేస్తామని వెల్లడించారు. ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో బిహార్ ప్రభుత్వం ఇటీవల అక్కడి మహిళలకు నవరాత్రి కానుకగా ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున 75 లక్షల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసిన నేపథ్యంలో తేజస్వీ ఈ ప్రకటన చేశారు. గత వారం ప్రతిపక్షాలు విడుదల చేసిన మ్యానిఫెస్టో ప్రకారం.. డిసెంబర్ 1 నుంచి మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయంగా రాబోయే ఐదేళ్లు ఒక్కో సంవత్సరానికి మొత్తం రూ.30,000 ఇస్తామని తేజస్వీ హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగానే అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ఏడాదికి గాను మహిళలకు రూ.30వేలు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బిహార్ మహిళల కోరిక మేరకు ఏడాదికి చెల్లించే మొత్తం రూ.30 వేలను జనవరి 14న వారి ఖాతాలకు బదిలీ చేస్తామని తేజస్వీ తెలిపారు. కనీస మద్దతు ధర (ఓ÷ూఖ)తో పాటు బోనస్‌గా రైతులకు క్వింటాలు వరికి రూ.300, గోధుమలకు రూ.400 చెల్లిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా పోలీసు సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు వంటి అన్నిరకాల ప్రభుత్వ సిబ్బందికి వారి సొంత జిల్లాల నుంచి 70 కిలోమీటర్ల పరిధిలో నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా బిహార్ ఎన్నికల నేపథ్యంలో విపక్ష కూటమి మహాగర్‌బంధన్ ఇటీవల 'తేజస్వీ ప్రతిజ్ఞా ప్రణ్' పేరుతో తమ మ్యానిఫెస్టోను విడుదల చేసింది. అందులో తాము అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ తదితర హామీలను అమలు చేస్తామని పేర్కొంది.. రైతులకు నీటి పారుదల కోసం ఉచిత విద్యుత్ అందిస్తాము. మై బహీన్ మాన్ యోజన పథకం కింద మహిళల బ్యాంకు ఖాతాల్లో జనవరి 14వ తేదీకల్లా రూ. 30,000లు జమ చేస్తాం. ఇది సంవత్సరం మొత్తానికి వర్తిస్తుంది. నూతన సంవత్సరం, మకర సంక్రాంతి పండుగల సందర్భంగా ముందుగానే నగదును జమ చేస్తాం. నిత్యవసర ధరలు పెరిగిన ఈ సమయంలో.. ఈ డబ్బుతో వారికి కొంత ఆర్థిక ఉపశమనం లభిస్తుంది. రాష్ట్రంలోని మా తల్లులు, సోదరీమణుల డిమాండ్ల మేరకే మా ప్రభుత్వం ఏర్పడుతుంది' అని ఆయన అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి మహాగట్బంధన్ కట్టుబడి ఉందని తేజస్వి తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆరోగ్య కార్యకర్తల బదిలీలు వారి ఇంటి నుండి 70 కిలోమీటర్ల లోపే వారి బదిలీలు చేస్తాము. బదిలీల పోస్టింగ్‌లో కచ్చితంగా ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటాము. దీన్నే మ్యానిఫెస్టోలో కూడా ప్రస్తావించాము అని తేజస్వి అన్నారు.

# హిందూపురంలో వందేభారత్ స్టాప్

## వెల్లడించిన ఎంపి బికె పార్థసారథి



హిందూపురం,**నవంబర్ 4ప్రజావినికిడి**
వందే భారత్ రైలు పది రోజుల్లోపు హిందూపురంలో ఆగుతుందని ఎంపీ బీకే పార్థసారథి తెలిపారు. హిందూపురానికి వచ్చిన ఆయన విలేకరలుతో మాట్లాడారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, తాను రైల్వేశాఖ సహాయమంత్రి సోమన్నతో మాట్లాడామని తెలిపారు. హిందూపురంలో వందే భారత్ రైలును ఆపేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని అన్నారు. రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనులు చేపడుతున్నామని అన్నారు. బళ్లారి నుంచి మడకశిర మీదుగా రైల్వే ట్రాక్ పనులు వేగంగా సాగుతాయని అన్నారు. చాకర్లపల్లి రైల్వే గేటువద్ద ÷÷-ల ఓవర్ బ్రిడ్జి పనులు త్వరలో ప్రారంభం అవుతాయని, దీనికి రూ.29 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఏడాదిలోపే పనులు పూర్తవుతాయని అన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని, రూ.92 కోట్లతో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని అన్నారు. సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, పార్టీ కన్వీనర్ శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు ఆనంద్, చంద్రమోహన్, పట్టణాధ్యక్షులు వెంకటేశ్, మంగేష్ తదితరులు పాల్గొన్నారు.

------

# యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

## కారును ఢీకొన్న ట్రక్కు..ఆరుగురు దుర్మరణం

లక్నో,**నవంబర్ 4ప్రజావినికిడి** ఉత్తరప్రదేశ్‌లో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బారాబంకిలోని దేవా- ఫతేపూర్ రహదారిపై ట్రక్కు కారును బలంగా ఢకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. ఇద్దరికి గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి బారాబంకి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అర్పిత్ విజయవర్గియ తెలిపిన వివరాల ప్రకారం.. ఎనిమిది మందితో వెళుతున్న కారును దేవా పోలీస్ స్టేషన్ ప్రాంతంలో ట్రక్కు బలంగా ఢకొ?ట్టింది. దీంతో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఆరుగురు మృతి చెందారు. మెరుగైన చికిత్స కోసం ఇద్దరినీ వేరే ఆసుపత్రికి తరలించాము. కారు, ట్రక్కు రెండు వాహనాలు వ్యతిరేక దిశలో వస్తున్నాయి. అందువల్లే ఈ ప్రమాదం జరిగింది అని ఆయన అన్నారు.


-------

# ఆర్టీసీ బస్సు ఢీకొని టీచర్‌కు గాయాలు

అల్లూరి**ననవంబర్ 4ప్రజావినికిడి**మక్కువ మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద సాలూరు నుండి వయా మామిడిపల్లి మీదుగా దుగ్గేరు వెళ్లేందుకు వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మక్కువ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఆకుల తవిటి నాయుడు గాయపడ్డారు. మంగళవారం తవిటి నాయుడు మధ్యాహ్నం ఇంటికి సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చి తిరిగి వెళుతుండగా, అదే సమయంలో దుగ్గేరు వెళ్లేందుకు మక్కువ ప్రధాన రహదారి వద్ద డ్రైవర్ బస్సును టర్న్ తీసుకోను సందర్భంలో అతనిని ఢకొన్నట్లు తెలుస్తుంది. కవిటి నాయుడు కాలుకు తీవ్ర గాయం కావడంతో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించిన ట్లు సమాచారం. పోలీసులు దర్యాప్తులో మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

-----------

# విజయగరంలో స్వల్ప ప్రకంపనలు



విజయనగరం**నవంబర్ 4ప్రజావినికిడి**
విజయనగరం పట్టణ, మండల పరిధిలో మంగళవారం వేకువజామున 4 గంటల 19 నిమిషాల సమయంలో భూమి కొన్ని సెకండ్ల పాటు కనిపించినట్లు స్థానికులు తెలిపారు. ఆ సమయంలో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. విజయనగరం పట్టణ ప్రాంతం ఆర్‌ఎంబి జంక్షన్ , కేఎల్ పురం, టౌన్ లో మరికొన్ని ప్రాంతాల్లోను, విజయనగరం మండల పరిధిలో ముడుదాం, అంబటి వలస , చెల్లూరు మరికొన్ని గ్రామాల్లో కూడా భూమి కనిపించినట్లు ప్రజలు తెలిపిన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# మరోమారు స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

హైదరాబాద్,**నవంబర్ 4ప్రజావినికిడి**త కొన్ని రోజులుగా బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. సోమవారం స్వల్పంగా పెరిగి రూ.1.23 లక్షల మార్కు దాటిన బంగారం ధర మంగళవారం మళ్లీ దిగొచ్చింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.710 మేర తగ్గి రూ.1,22,460కు చేరుకుంది. 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధరలో రూ.650 మేర కోత పడి రూ..1,12,250కు దిగింది. వెండి ధర ఏకంగా రూ.3 వేల మేర తగ్గింది. ప్రస్తుతం కిలో వెండి రూ.1,51,000గా ఉంది .హైదరాబాద్, విజయవాడల్లో ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,22,460గా ఉంది. 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,12,250గా ఉంది. రెండు నగరాల్లో వెండి రేట్ కిలోకు రూ.1,65,000 వద్ద కొనసాగుతోంది. మదపర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు దిగడం, ఫెడ్ వడ్డీ రేట్ల కోతపై నానాటికీ సన్నగిల్లుతున్న ఆశలు, మళ్లీ పుంజుకున్న డాలర్ వెరసి బంగారం ధరలను తగ్గిస్తున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

# ఫ్లెమింగోలకే కాదు, పులస చేపలకూ

## శాశ్వత నివాసం కల్పించండి: పవన్‌పై భూమన సెటైర్

**నవంబర్ 4ప్రజావినికిడి**
డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పులికాట్ సరస్సులో ఫ్లెమింగో పక్షులకు శాశ్వత నివాసం కల్పించాలని పవన్ పేర్కొనడాన్ని ప్రస్తావిస్తూ, ఆయనపై సెటైర్లతో విరుచుకుపడ్డారు.భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. "పులికాట్ సరస్సులో ఫ్లెమింగో పక్షులకు శాశ్వత నివాసం కల్పించాలని మీరు అనడం అభినందనీయం. మీ పేరులోనే పవనం, కల్యాణం రెండూ ఉన్నాయి. అదేవిధంగా, సైబీరియా నుంచి వందల ఏళ్లుగా వలస వచ్చే ఫ్లెమింగోల తరహాలోనే, వందల కిలోమీటర్లు ప్రయాణించి గోదావరికి వచ్చే పులస చేపలకు కూడా శాశ్వత నివాసం కల్పించాలని కోరుతున్నాం" అని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా, "ఏప్రిల్, మే నెలల్లో శీతల వాతావరణాన్ని మీ అధీనంలో ఉంచుకుని రాష్ట్రంలో శాశ్వతంగా చల్లదనం ఉండేలా చూడాలి" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.సనాతన ధర్మ పరిరక్షకులుగా పవన్ కల్యాణ్ ఇంకా ఎన్నో చేయాలని భూమన చురకలంటించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రమాదాలు జరగకుండా రోడ్లు వేయాలని, దేవాలయాల్లో ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, మద్యం మత్తులో అనర్థాలు జరగకుండా చూడాలని సూచించారు. "మీరు గాల్లో పక్షుల్ని, నీటిలో చేపల్ని కూడా మీ ఆధీనంలోకి తీసుకోవాలని అనుకోవడం అభినందనీయం. ప్రకృతిని శాసించే శక్తి మీకు కలగాలని ఆ దేవుడ్ని ప్రార్థిస్తున్నా" అని అన్నారు. ఇప్పటికే మీ జ్ఞాన తృష్ణ ప్రజలకు అర్థం అయ్యిందని వ్యాఖ్యానించారు.

# శ్రీవారికి వెండి గంగాళం వితరణ

## హైదరాబాద్ భక్తుడి విరాళం



తిరుమల,హైదరాబాద్,**నవంబర్ 4ప్రజావినికిడి** ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం దేశ విదేశాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున కొండకు తరలి రావడం, స్వామిని దర్శించుకుని విరాళాలు అందించడం జరగుతోంది.ప్రతీరోజు కొన్ని వేల మంది ఆ గోవిందుడిని దర్శించుకుంటారు. అంతేకాకుండా ఎవరి స్తోమత బట్టి వారు స్వామికి విరాళాలు ఇస్తుంటారు. వజ్రాలు, బంగారం, వెండితో చేసిన ఆభరణాలు, వస్తువులు.. లేదా పెద్ద మొత్తంలో నగదును విరాళంగా అందజేసి ఆ శ్రీవారిపై తమ భక్తిని చాటుకుంటారు. అదే విధంగా హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు కుటుంబంతో కలిసి శ్రీవారికి భారీ వెండి గంగాళాన్ని విరాళంగా సమర్పించారు. హైదరాబాద్‌కు చెందిన జక్కారెడ్డి శ్రీనివాసులు రెడ్డి అనే భక్తుడు (మంగళవారం ఉదయం కుటుంబసమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి రూ.30 లక్షలు విలువ చేసే 22 కేజీల వెండి గంగాళాన్ని విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయం ముందు ఆలయ అధికారులకు గంగాళాన్ని భక్తుడు తన కుటుంబసభ్యులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులుకు ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# చేవెళ్ల రోడ్డు ప్రమాదస్థలిని సందర్శించిన డిజిపి

## టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాద కారణం

## దర్యాప్తులో పూర్తి వివరాలు తెలుస్తాయని వెల్లడి



హైదరాబాద్,**నవంబర్ 4ప్రజావినికిడి** : రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మిర్జాగూడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంపై పోలీసుల దర్యాప్తులో అన్ని విషయాలు వెల్లడవుతాయని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ బస్సు ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం డీజీపీ శివధర్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. టిప్పర్ అతివేగంగా వచ్చి ఆర్టీసీ బస్సును ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదం జరిగిన తీరు చూస్తే టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. ఇక రోడ్డు ప్రమాదానికి గురైన టిప్పర్ కండిషన్‌ను మెకానిక్ ద్వారా పరిశీలిస్తున్నా మన్నారు. దాదాపు 40 మీటర్లు టిప్పర్ లాక్కెళ్లడంతో ఈ ప్రమాద తీవ్రత పెరిగిందని వివరించారు. ఈ ప్రమాద సమయంలో ఆర్టీసీ బస్సులో రైట్ సైడ్ కూర్చున్న వారు చాలా మంది తమ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అయితే రోడ్డు మలుపు ఉంది కానీ.. అది యాక్సిడెంట్ అయ్యేంత తీవ్రంగా లేదన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన టిప్పర్ లారీ ఓనర్ లక్ష్మణ్ నాయక్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను ప్రభుత్వ పరంగా చూడకూడదని.. ఇది అందరి బాధ్యతగా చూడాల్సి ఉందని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. రోడ్డు ప్రమాదాలు పెద్ద సమస్యగా మారిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. చాలా మంది ప్రయాణికులు రోడ్డు ప్రమాదాల కారణంగానే మరణిస్తున్నారని గుర్తు చేశారు. రోడ్డు మీద డ్రైవ్ చేసే వారు డిఫెన్స్ కండిషన్‌ను అంచనా వేసుకొని డ్రైవ్ చేయాల్సి ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలపై వచ్చే నెల నుంచి అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రకటించారు. ఈ ప్రమాదాన్ని చేవెళ్ల ఏసీపీ విచారణ అధికారగా దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించిన అన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు.

# జీవితంలో గెలవాలంటే క్రమ శిక్షణ ముఖ్యం

## ఎంపీ మాధవనేని రఘునందన్ రావు



**మెదక్ నవంబర్ 4ప్రజావినికిడి**

యువత గెలవాలంటే క్రమశిక్షణ ముఖ్యమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విద్యార్థులకు తెలియజేశారు. మెదక్ పట్టణంలోని స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లా యువజనోత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వామి వివేకనంద చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాధవనేని రఘునందన్ రావు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో గెలవాలంటే క్రమశిక్షణ ఒక్కటే మార్గం అన్నారు. బట్టి చదువులకు స్వస్తి చెప్పి విశ్లేషణాత్మకంగా చదవాలన్నారు. లక్ష్యం చేరాలంటే సోషల్ మీడియాను దూరంగా ఉంచాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. మహిళా క్రికెట్లో భారత మహిళా జట్టు విజయం సాధించి 140 కోట్ల మంది భారతీయుల అభిమానాన్ని చురగోన్నారని గుర్తు చేశారు. యువతలో గెలుస్తానని తపన ఉండాలన్నారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతదేశ క్రీడల్లో వెనుకంజులో ఉందన్నారు. దాన్ని మరింత ముందుకు తీసుకుపోవడానికి యువకులందరూ కృషి చేయాలి అన్నారు. ప్రతి వ్యక్తిలో యోగా నిత్యజీవితంలో భాగం కావాలన్నారు. యువకులు తల్లిదండ్రులు ఆశయాలని నెరవేరుస్తూ వాళ్ళ లక్ష్యాలను సాధించాలని కోరారు. తెలంగాణ నుంచి నిక్కత్ జరీన్ ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు షీల్డ్, ప్రశంసా పత్రం అందించి, శలువతో ఎంపీ రఘు నందన్ రావు సత్కరించారు

కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి రమేష్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# బస్సు ప్రమాదం మిగిల్చిన విషాధ గాథలు

## మరో రెండునెలల్లో నాన్న నీ కష్టం తీరుస్తామన్న కూతుళ్ళు

## పేర్కంపల్లి లోనిఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కా చెల్లెళ్ళ దుర్మరణం

## హాజీపూర్ లో అనాధలైన ఆడబిడ్డలు -హాజీపూర్, లక్ష్మీనారాయణ పూర్, పేర్కంపల్లి గ్రామాల్లో విషాధ ఛాయలు







హైదరాబాద్,**నవంబర్ 4ప్రజావినికిడి** .సోమవారం చేవెళ్ళ మీర్జాగూడ బస్సు ప్రమాదం లో చనిపోయిన యాలాల మండలం పేర్కంపల్లి, హాజీపూర్, లక్ష్మీనారాయణ పూర్ గ్రామాలలో విషాద ఛాయలు. హాజీపూర్ గ్రామం లో తల్లిదండ్రులు చనిపోవడం తో వారి కూతుళ్లు ఇద్దరు అనాధలయ్యారు. వీరిలో పెద్ద అమ్మాయి భవాని, రెండవ కూతురు శిరీష. వీరిలో పెద్ద అమ్మాయి తాండూర్ లోని నంబర్ 1 పాఠశాల లో చదివి బడి మానివేసి ఇంటిదగ్గర నే ఉంటుంది. చిన్న అమ్మాయి శిరీష గ్రామం లో 4 వ తరగతి చదువుకుంటుంది. వీరికి ఎటువంటి ఆస్తిపాస్తులు లేవు సెంటు భూమి కుడా లేదు. కావున వీరిని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కి విజ్ఞప్తి చేశారు. మరణించిన కుటుంబాలను మంగళవారం తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సందర్శించి అందగా ఉంటానని ప్రతీ కుటుంబానికి పది వేల రూపాయల ఆర్థిక సహాయం చేశాడు. అలాగే పేర్కంపల్లి గ్రామం లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కా చెల్లెల్లు తనూష, సాయిప్రియ,నందిని చనిపోవడం తో గ్రామం లో విశాదం అలుముకుంది. గ్రామానికి చెందిన ఎల్లయ్య గౌడ్ కూతుర్లయిన వీరు ముగ్గురు వరుసకు సోదరుని వివాహనికి వచ్చి తిరుగు ప్రయాణం లో హైదరాబాద్ వెళ్లే క్రమంలో ఈ దుర్ఘటన జరిగింది. దీంతో వారి తల్లి తండ్రి రోదనలను ఆపడం ఎవరి తరం కాలేదు. తండ్రి డ్రైవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ ఉండేవాడు. తండ్రి పడే కష్టం మరో రెండు నెలల్లో తన కూతురు తీరుస్తామని వారికి రెండు నెలల్లో ఐటీ కంపెనీ లో ఉద్యోగం వచ్చింది. రెండు నెలల్లో నాన్న నిన్ను హైదరాబాద్ కు తీసుకెళ్తామని చెప్పడం జరిగింది. కానీ ఇంతలో ఈ సంఘటన జరగడం తో తీవ్ర మనివేదనకు తల్లి తండ్రి గురయ్యారు. నన్ను ఎంతో బాగా చూసుకునే వారని ఎప్పుడూ హైదరాబాద్ నుండి వచ్చేటప్పుడు పండ్లు తీసుకువచ్చేవారని ఎంతో ప్రేమగా చూసుకునే వారని, బాధా తప్త హృదయం తో తండ్రి ఎల్లయ్య గౌడ్ తెలిపాడు. అలాగే లక్ష్మీనారాయణ పూర్ గ్రామానికి చెందిన గుర్రాల శ్రీనివాస్ రెడ్డి అలవేలు దంపతుల కుమార్తె అఖిలా రెడ్డి ఈ బస్సు ప్రమాదం లో చనిపోవడం తో ఇంట్లో విషాదం అలుముకుంది. వీరికి ఎరువంటి జీవనధారం లేదు ఇతరుల పొలాన్ని కౌలుకు తీసుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. కూతురు మరణాన్ని తట్టుకోలేక తల్లి రోదనను చూసి ఆమెను ఆపడం ఎవరితరం కాలేదు. దీంతో యాలాల మండలం లని ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. వీరి బాధ వర్ణనాతీతం. భగవంతుడా ఎంత పనిచేశావయ్య ఎందుకిత పగ అని వారి కుటుంబీకులు గ్రామస్థుల రోదనలు మిన్నంటాయి.

# ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరోమారు వర్షం

## అకాల వర్షంతో తడిసిపోయిన పత్తి, వరిధాన్యం

## హైదరాబాద్‌లో పలుచోట్ల కురిసిన వర్షం



**/వరంగల్,హైదరాబాద్,నవంబర్ 4ప్రజావినికిడి** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉరుములతో వర్షాలు దంచికొట్టాయి. మంగళవారం ఉదయం నుంచి కుండపోత వానలు కురిశాయి. వరంగల్ నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారింది. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు కురిసిన కుండపోత వర్షానికి నగర రహదారులు చెరువులను తలపించాయి. దీంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షానికి ఎనుమాముల మార్కెట్‌లో పత్తి, మొక్కజొన్న తడిసిపోయింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఏర్పడ్డ 'మొంథా' తుపాను ముంపు నుంచి ఇంకా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలు పూర్తిగా తేరుకోలేదు. మరోసారి వర్షాలు కురవడంతో లోతట్టుప్రాంత ప్రజల్లో ముంపు భయం నెలకొంది. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణపేట, గద్వాల్, మేడ్చల్ – మల్కాజిగిరి, యాదాద్రి – భోంగీర్ వంటి పశ్చిమ, మధ్య, దక్షిణ తెలంగాణలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడుతాయని తెలంగాణ వెదర్ మ్యాన్ అంచనా వేశారు. రాజన్న సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్, జనగాం జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్, సంబంధిత అధికారులతో కలిసి జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 11వ డివిజన్ పోతన నగర్‌లో క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించారు. నాళాల భౌతిక స్థితి పరిశీలించి, వరద నీరు నిల్వ ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాల సూచించారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లో మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పలుచోట్ల జల్లులు కురిసాయి. రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కుస్తాయనివాతావరణ శాఖ తెలిపింది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లిడించింది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్, నల్లగొండతోపాటు పలు జిల్లాల్లో భారీ వాన కురుస్తున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉదయం భారీ వర్షం పడింది. సుమారు అరగంటపాటు ఈదురు గాలులతో కూడిన వాన కుండపోతగా కురిసింది. దీంతో రహదారులు జలమయమయ్యాయి. ఇక నల్లగొండ జిల్లాలో భారీ వర్షం కురుస్తున్నది. అరేబియా సముద్రం నుంచి తెలంగాణ వైపు తేమ గాలులు వీస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం నుంచి పొడి వాతావరణం కొనసాగే అవకాశం ఉందని తెలిపింది.

# ట్రాక్టర్‌ను ఢీకొన్న ట్రావెల్ బస్సు

## రోడ్డుకు అడ్డంగా పడ్డ ట్రాక్టర్..నలుగురికి గాయాలు



నల్లగొండ,,**నవంబర్ 4ప్రజావినికిడి** చేవెళ్లలో ఘోర బస్సు ప్రమాద ఘటన మరవక ముందే మరో యాక్సిడెంట్ జరిగింది. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం వద్ద అద్దంకి-నార్కట్‌పల్లి హైవేపై వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపుతప్పి ముందువెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న నలుగురు కూలీలు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మిర్యాలగూడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ట్రావెల్స్ బస్సు ఆంధ్రప్రదేశ్ లోని కావలి నుంచి హైదరాబాద్‌కు వెళు‌ుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఈ ఘటన జరిగిందన్నారు. ప్రమాద సమయంలో బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నారని చెప్పారు. ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# పెరిగిన మహిళా క్రికెటర్ల బ్రాండ్ విలువ



కప్ ఫైనల్‌లో భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. 52 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను మట్టికరిపించి తొలిసారిగా విశ్వవిజేతగా నిలిచింది. పురుష క్రికెటర్ల మాదిరిగానే తమ ప్రభావాన్ని చూపి వన్డే ప్రపంచకప్‌ను తమ సొంతం చేసుకుంది భారత మహిళా జట్టు. తమ సత్తా ఏంటో ప్రంపంచానికి చాటి చెప్పింది. ఈ విజయంతో మహిళా క్రికెటర్లపై దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుసింది. వరల్డ్‌కప్ విజయంతో టీమ్‌ఇండియా మహిళా క్రికెటర్లకు గౌరవం, గుర్తింపు మాత్రమే కాకుండా, వాణిజ్య విలువ కూడా ఆకాశాన్నంటింది. ఇప్పుడు వీరిని బ్రాండ్ ప్రపంచం కొత్త స్టార్‌లుగా చూస్తోంది. మొత్తంగా చూస్తే ఈ ప్రపంచ కప్ విజయం భారత మహిళా క్రీడాకారిణులకు ఒక కొత్త శకానికి నాంది పలికింది. మహిళా వరల్డ్‌కప్ ఫైనల్ ముగిసిన 24 గంటల వ్యవధిలోనే హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, షెఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ వంటి ఆటగాళ్ల బ్రాండ్ విలువలు 25 నుంచి 100 శాతం వరకూ పెరిగినట్లు సమాచారం. అదే సమయంలో వీరి సోషల్ మీడియా ఫాలోవర్లు కూడా విపరీతంగా పెరిగారు. సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై అద్భుత ప్రదర్శనతో 127 పరుగులు (134 బంతుల్లో, 14 ఫోర్లతో) చేసి నాటౌట్‌గా నిలిచిన జెమీమా రోడ్రిగ్స్ ప్రస్తుతం అత్యంత డిమాండ్‌లో ఉన్న మహిళా స్టార్ క్రికెటర్‌గా ముందంజలో ఉంది. సెమీ ఫైనల్ ముగిసిన తర్వాత ఆమెకు బ్రాండ్‌ల నుంచి విపరీతమైన ఆసక్తి కనిపించింది. ఆమె బ్రాండ్ విలువ 100 శాతం పెరిగినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు ఆమె ఒక్కో బ్రాండ్‌కు రూ.75 లక్షల నుంచి రూ.1.5 కోట్ల వరకు ఛార్జ్ చేస్తోందట. జెమీమా ఇప్పటికే రెడ్‌బుల్, బోట్, సర్ఫ్‌ఎక్స్‌ఎల్ వంటి ప్రముఖ బ్రాండ్‌లకు అంబాసడర్‌గా వ్యవహరిస్తోంది. దేశంలో అత్యధిక పారితోషికం పొందుతున్న మహిళా క్రికెటర్‌గా స్మృతి మంధాన కొనసాగుతోంది. ప్రస్తుతం ఆమె రక్సోనా, నైక్, హ్యుందాయ్, హెర్బాలైఫ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గల్ఫ్ ఆయిల్, పీఎన్‌బీ మెట్‌లైఫ్ ఇన్సూరెన్స్ వంటి 16 ప్రముఖ బ్రాండ్‌లకు అంబాసడర్‌గా ఉంది. ఒక్కో బ్రాండ్ ఎండార్స్‌మెంట్ ద్వారా రూ.1.5 నుంచి రూ.2 కోట్ల వరకు సంపాదిస్తున్నట్లు తెలిసింది. మొదటి సారిగా ఐసీసీ ప్రపంచ కప్‌ను గెలుచుకున్న తర్వాత మైదానంలో భావోద్వేగపూరితమైన దృశ్యం ఆవిష్కృతమైంది. గెలుపు అనంతరం భారత మహిళా జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కోచ్ అమోల్ మజుందార్ పాదాలను తాకి నమస్కరించింది. దీంతో భారత గురు- శిష్య సంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనంగా ఈ చర్య నిలిచింది. మజుందార్ వెంటనే ఆమెను ఆప్యాయంగా పైకిలేపారు. కాగా ఈ విజయం కోచ్, కెప్టెన్ ఇద్దరి కళ్లలో ఆనంద బాష్పాలను నిపింది.

# త్వరలో పెళ్లి బంధంలోకి స్మృతి అడుగు

ప్రపంచ ఛాంపియన్ స్మృతి మంధాన త్వరలో వివాహం చేసుకోబోతున్నారు. స్మృతి తన ప్రియుడు పలాష్ ముచ్చల్ తో పెళ్లి చేసుకోనున్నారు. స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ దాదాపు 6 సంవత్సరాలుగా ఒకరితో ఒకరు ఉన్నారు. భారతదేశం ప్రపంచ కప్ గెలిచిన తర్వాత కూడా పలాష్, స్మృతితో కనిపించారు. స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ వరల్డ్ కప్ ట్రోఫీతో ఫోటో దిగారు. ఈ జంట భారతదేశం సాధించిన విజయాన్ని కలిసి సెలబ్రేట్ చేసుకున్నారు. పలాష్ తన చేతిపై స్మృతి మంధానా పేరుతో టాటూ కూడా వేయించుకున్నారు. పలాష్ తన సోషల్ మీడియాలో దీని ఫోటోను కూడా షేర్ చేశాడు. పలాష్ ముచ్చల్ సంగీత దర్శకుడు. పలాష్ సోదరి, గాయని పలక్ ముచ్చల్‌తో కూడా స్మృతి మంధానకు మంచి సంబంధం ఉంది. పలక్ ముచ్చల్ స్మృతి పుట్టినరోజున కలిసిన ఫోటో కూడా షేర్ చేసింది. పలాష్ 'తూ హి హై ఆషికీ', 'పార్టీ తో బనతీ హై' వంటి హిట్ పాటలపై వర్క్ చేశారు. స్మృతి మంధాన, పలాష్ ముచ్చల్ లవ్ స్టోరీ 2019లో ప్రారంభమైంది. పలాష్ తన సోదరి పలక్ ముచ్చల్ ముందు స్మృతికి ప్రపోజ్ చేశాడు, ఆమె కోసం చాలా అందమైన పాట కూడా పాడాడు. పలాష్ ముచ్చల్ స్మృతి మంధానతో తన సంబంధం గురించి జూలై 2024లో వెల్లడించాడు, అప్పుడు వారి సంబంధానికి ఐదు సంవత్సరాలు పూర్తయ్యాయి. పలాష్ ఇటీవల మాట్లాడుతూ స్మృతి మంధానా త్వరలో ఇండోర్ కోడలు కాబోతోందని కూడా చెప్పాడు. ఆనంద బజార్ పత్రిక ప్రకారం,



ఈ జంట వివాహం నవంబర్ 20, 2025 న జరగవచ్చు. వీరి వివాహం స్మృతి స్వస్థలమైన సాంగ్లీలో జరగవచ్చు.

# బిగ్ బాష్ లీగ్ నుంచి తప్పుకున్న అశ్విన్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత.. ఆస్ట్రేలియాలో జరగబోయే బిగ్ బాష్ లీగ్‌లో ఆడటానికి సిద్ధమైన భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. బీబీఎల్ తదుపరి సీజన్‌లో సిడ్నీ థండర్ తరపున ఆడడం దాదాపు ఖాయమైనప్పటికీ, గాయం కారణంగా ఆయన ఈ లీగ్ నుంచి తప్పుకున్నట్లు ప్రకటించారు. అశ్విన్ గనుక ఆడి ఉంటే, బీబీఎల్లో ఆడిన మొట్టమొదటి భారత పురుష క్రికెటర్‌గా చరిత్ర సృష్టించి ఉండేవారు. అశ్విన్‌కు అయిన గాయం ఏమిటి ఎప్పుడు తిరిగి వచ్చే అవకాశం ఉంది వంటి వివరాలు ఈ వార్తలో చూద్దాం. భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ క్రికెట్ మైదానంలోకి తిరిగి రావడానికి మరింత వేచి చూడాల్సి వస్తుంది. మోకాలి గాయం కారణంగా ఆయన ఆస్ట్రేలియాలో జరగబోయే బిగ్ బాష్ లీగ్ 15వ సీజన్ నుంచి తప్పుకున్నారు. అశ్విన్ బీబీఎల్ లో సిడ్నీ థండర్ జట్టు తరపున పూర్తి సీజన్ ఆడటానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒకవేళ అశ్విన్ ఆడి ఉంటే బీబీఎల్ చరిత్రలో ఆడిన మొట్టమొదటి భారత పురుష క్రికెటర్‌గా నిలిచి ఉండేవారు. కానీ గాయం కారణంగా ఈ చారిత్రక అవకాశం ప్రస్తుతానికి మిస్ అయింది. అశ్విన్ త్వరగా కోలుకుంటే, సీజన్ మధ్యలో సిడ్నీ థండర్ జట్టు అతన్ని తిరిగి ఆడటానికి ఆహ్వానించే అవకాశం ఉంది. అశ్విన్ స్వయంగా సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేసి, తన గాయం, బీబీఎల్ నుంచి వైదొలగడం వెనుక కారణాలను తెలియజేశారు. "బీబీఎల్ తదుపరి సీజన్‌కు చెన్నైలో సిద్ధమవుతున్న సమయంలో నాకు మోకాలిలో గాయం అయింది. పరీక్షల తర్వాత, నేను బీబీఎల్ 15లో ఆడలేనని తెలిసింది" అని అశ్విన్ తన ప్రకటనలో తెలిపారు.

ఆస్ట్రేలియన్ అభిమానుల ముందు ఆడటానికి తాను ఎంతగానో ఉత్సాహంగా ఉన్నానని, కానీ ఈ నిర్ణయం తీసుకోవడం తనకు బాధ కలిగించిందని ఆయన వ్యక్తం చేశారు. సిడ్నీ థండర్ ఆటగాళ్లు, సిబ్బంది తనకు పూర్తి మద్దతు ఇచ్చారని అశ్విన్ తెలిపారు. మైదానంలో లేకపోయినా, తాను థండర్ మహిళా, పురుషుల జట్లను ఉత్సాహపరుస్తూ ఉంటానని చెప్పారు. రవిచంద్రన్ అశ్విన్ అదే సంవత్సరంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత బీబీఎల్ లో ఆడాలని నిర్ణయించుకున్నారు. అశ్విన్ ఈ సంవత్సరం ఐపీఎల్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్నాడు. ఆ తరువాత అంతర్జాతీయ లీగ్‌లలో ఆడటానికి మొగ్గు చూపాడు. బిగ్ బాష్ లీగ్ 15వ సీజన్ డిసెంబర్ 14 నుంచి జనవరి 25 వరకు జరగనుంది. సిడ్నీ థండర్ జట్టు తమ మొదటి మ్యాచ్‌ను డిసెంబర్ 16న హెూబర్ట్ హరికేన్స్‌తో ఆడాల్సి ఉంది. ఈ మధ్యలో అశ్విన్‌కు ఐఎల్టీ20 లీగ్‌లో ఏ జట్టు కూడా కొనుగోలు చేయకపోవడం గమనార్హం.

# జైస్వాల్ మెరుపు సెంచరీ


**• పలు రికార్డులు నమోదు**



భారత యువ క్రికెట్ సంచలనం యశస్వి జైస్వాల్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ మరో సెంచరీ సాధించాడు. ప్రస్తుతం రాజస్థాన్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ముంబై తరఫున ఆడుతున్న జైస్వాల్, రెండో ఇన్నింగ్స్‌లో మెరుపు సెంచరీతో జట్టును కష్టాల నుంచి గట్టెక్కించాడు. ఈ సెంచరీతో అతను తన అద్భుతమైన టచ్‌ను ప్రదర్శించడమే కాక, గత 45 ఏళ్లలో టెస్ట్ క్రికెట్‌లో అత్యుత్తమ సగటు కలిగిన ఓపెనర్లలో నెంబర్ 1 స్థానంలో ఎందుకు ఉన్నాడో మరోసారి నిరూపించాడు. రాజస్థాన్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ముంబై జట్టు తరఫున ఆడుతున్న యశస్వి జైస్వాల్ అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన చేశాడు. జైస్వాల్ కేవలం 120 బంతుల్లోనే 11 బౌండరీల సహాయంతో ఈ సెంచరీని పూర్తి చేశాడు. ఈ సెంచరీతో రాజస్థాన్ మొదటి ఇన్నింగ్స్‌లో తీసుకున్న భారీ ఆధిక్యం (300o రన్స్) ఒత్తిడి నుంచి ముంబై జట్టును గట్టెక్కించాడు. ఇది అతని ఫస్ట్ క్లాస్ క్రికెట్ కెరీర్‌లో 17వ సెంచరీ కావడం విశేషం. అంతేకాక, రెడ్ బాల్ క్రికెట్ ఆడిన గత నాలుగు ఇన్నింగ్స్‌లలో అతను రెండు సెంచరీలు, మూడు యాభైకి పైగా స్కోర్‌లు చేశాడు. ఈ సెంచరీతో యశస్వి జైస్వాల్ కేవలం దేశీయ క్రికెట్‌లో మాత్రమే కాక, అంతర్జాతీయ స్థాయిలో కూడా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో కనీసం 2,000 టెస్ట్ పరుగులు చేసిన ఓపెనర్లలో, జైస్వాల్ ఒక అరుదైన రికార్డును నెలకొల్పాడు. అతను 1980 నుంచి ఇప్పటివరకు ఉన్న ఓపెనర్లలో అత్యుత్తమ సగటు కలిగిన బ్యాటర్‌గా నిలిచాడు. యశస్వి జైస్వాల్ సగటు 52.60గా ఉంది. ఈ విషయంలో అతను ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్‌ను వెనక్కి నెట్టాడు, హేడెన్ సగటు 50.73 గా ఉంది. ఈ గణాంకాలు టెస్ట్ క్రికెట్‌లో అతని అద్భుతమైన స్థిరత్వాన్ని తెలియజేస్తాయి. రాజస్థాన్ మొదటి ఇన్నింగ్స్ భారీ ఆధిక్యం కారణంగా, ముంబై జట్టు రెండో ఇన్నింగ్స్‌లో కష్టాల్లో ఉండే అవకాశం ఉంది. ఈ సమయంలో జైస్వాల్ ఇన్నింగ్స్ జట్టుకు చాలా అవసరం. యశస్వి జైస్వాల్, ముషీర్ ఖాన్ జోడి మొదటి వికెట్‌కు ఏకంగా 149 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి, ముంబైకి పటిష్టమైన పునాదిని వేశారు. ముషీర్ ఖాన్ 63 పరుగులు చేసి ఔటైనా, జైస్వాల్ క్రీజులో నిలకడగా ఉండి తన సెంచరీ పూర్తి చేశాడు. అతని ఈ అసాధారణ ఇన్నింగ్స్ ముంబైని సురక్షితమైన స్థితికి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది.

# ఐసీసీ మీటింగ్‌కు మొహ్సిన్ నఖ్వీ డుమ్మా

భారతదేశం ఆసియా కప్ 2025 విజేతగా నిలిచి నెల రోజులు దాటినా.. ఇప్పటివరకు టీమిండియాకు కప్ దక్కలేదు. ఈ విషయంలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ ఛైర్మన్, ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ అయిన మొహ్సిన్ నఖ్వీ తీరు వివాదాస్పదంగా మారింది. భారత్ తరఫున బీసీసీఐ కప్ ఇవ్వాలని పదేపదే లేఖ రాసినా నఖ్వీ పట్టించుకోవట్లేదు. ఈ సమస్య ఇప్పుడు దుబాయ్‌లో జరుగుతున్న ఐసీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు మీటింగ్‌లో చర్చకు రానుంది. అయితే, ఈ మీటింగ్‌కు నఖ్వీ గైర్హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. బీసీసీఐ హెచ్చరికకు భయపడే ఆయన సమావేశాన్ని తప్పించుకుంటున్నారా అనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం దుబాయ్‌లో ఐసీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశాలు జరుగుతున్నాయి. ఈ కీలక సమావేశాలకు ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్ అయిన మొహ్సిన్ నఖ్వీ హాజరు కావడం కష్టమని తెలుస్తోంది. దేశీయ రాజకీయ సమస్యల కారణంగానే నఖ్వీ దుబాయ్‌కు రాలేకపోతున్నారని పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ వర్గాలు చెబుతున్నాయి. అయితే, ఈ సమావేశంలో బీసీసీఐ ఆసియా కప్ ట్రోఫీ అప్పగించడంలో ఆలస్యంపై అంశాన్ని లేవనెత్తే అవకాశం ఉంది. దీని వలన నఖ్వీపై ఒత్తిడి పెరగవచ్చని భావిస్తున్నారు. నఖ్వీ స్థానంలో బోర్డు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుమైర్ సయ్యద్ ముఖ్య కార్యనిర్వహణ అధికారుల సమావేశంలో పాల్గొంటారు. నవంబర్ 7న జరగబోయే కీలక బోర్డు మీటింగ్‌లో కూడా సయ్యద్ పాకిస్తాన్ తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంది. నఖ్వీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనే ఛాన్స్ కూడా ఉంది. సెప్టెంబర్ చివరి వారంలో ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్ జరిగింది, కానీ కప్ మాత్రం ఇంకా విజేతలైన టీమిండియాకు అందలేదు. ఆసియా కప్ ఫైనల్ ముగిసిన నెల రోజులు దాటినా, ట్రోఫీ ఇప్పటికీ దుబాయ్‌లోని ఏసీసీ ప్రధాన కార్యాలయంలో లాక్ చేసి ఉంది. ట్రోఫీని వెంటనే ముంబైకి పంపించాలని బీసీసీఐ, ఏసీసీకి



లేఖ రాసింది. అయితే, నఖ్వీ మాత్రం బీసీసీఐ ప్రతినిధికి లేదా భారత జట్టు సభ్యుడికి తానే స్వయంగా కప్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. అందుకే కప్ అప్పగించడంలో ఆలస్యం జరుగుతోంది. ఫైనల్ మ్యాచ్ అనంతరం భారత ఆటగాళ్లు నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించడానికి నిరాకరించడం ఈ వివాదానికి మూల కారణం. నఖ్వీ భారత్ వ్యతిరేక ప్రకటనలు చేశారనే కారణంతో టీమిండియా ఆటగాళ్లు ఫైనల్ తర్వాత ఆయన చేతుల మీదుగా కప్ అందుకోవడానికి నిరాకరించినట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే మొహ్సిన్ నఖ్వీపై చర్యలు తీసుకోవాలని బీసీసీఐ ఐసీసీ సమావేశంలో డిమాండ్ చేసే అవకాశం ఉంది. గతంలో జై షా ఐసీసీ ఛైర్మన్‌గా ఎన్నికైనప్పటి నుంచి నఖ్వీ ఏ ఐసీసీ మీటింగ్‌లోనూ పాల్గొనలేదు. నఖ్వీ పాకిస్తాన్‌లో హెూం మంత్రిగా కూడా ఉన్నారు.

# శ్రీచరణి వల్లే భారత్ గెలిచింది


**• శ్రీచరణిపై అశ్విన్ ప్రశంసల జల్లు**

భారత మహిళా స్పిన్నర్, తెలుగు తేజం నల్లపురెడ్డి శ్రీచరణిపై మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసల జల్లు కురిపించాడు. శ్రీ చరణి అద్భుత ప్రదర్శనతోనే టీమిండియా విజేతగా నిలిచిందని కొనియాడాడు. మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో టీమిండియా విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. ఆదివారం సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్లో 52 పరుగుల తేడాతో విజయం సాధించి తొలి ప్రపంచకప్‌ను ముద్దాడింది. ఈ టోర్నీలో ఆంధ్ర ప్రదేశ్, కడప జిల్లాకు చెందిన 21 ఏళ్ల శ్రీ చరణి 9 మ్యాచ్‌ల్లో 4.96 ఎకానమీతో 14 వికెట్లు పడగొట్టింది. 9 మ్యాచ్‌ల్లో ఒక్క మ్యాచ్ మినహా.. ప్రతీ మ్యాచ్‌లో వికెట్ తీసింది. ఫైనల్‌తో సహా సెమీఫైనల్లో శ్రీ చరణి కట్టడిగా బౌలింగ్ చేసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రపంచకప్ ఆడిన తొలి క్రికెటర్ గుర్తింపు పొందిన శ్రీచరణి.. పటిష్టమైన ఆస్ట్రేలియాపై లీగ్ మ్యాచ్‌తో పాటు సెమీఫైనల్లో అద్భుత ప్రదర్శన కనబర్చింది. ఈ రెండు మ్యాచ్‌ల్లో ఆసీస్‌పై ఆమె 5 వికెట్లు పడగొట్టింది. సెమీఫైనల్ ఓటమి తర్వాత ఆసీస్ కెప్టెన్ అలీసా హీలీ.. భారత జట్టులో శ్రీ చరణి ప్రమాదకరమైన బౌలర్ అని పేర్కొంది. అంటేనే ఆమె ప్రభావం ఏలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా ఈ విజయంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. శ్రీ చరణిని ప్రత్యేకంగా కొనియాడాడు. భవిష్యత్తులో ఆమె సూపర్ స్టార్ అవుతుందని జోస్యం చెప్పాడు. ఆమె బౌలింగ్ టెక్నిక్ అద్భుతంగా ఉందని కొనియాడాడు. మహిళల క్రికెట్‌లో గొప్ప స్పిన్నర్లు అయిన సోఫీ ఎక్లెస్టోన్, జెస్ జోనాసెలతో శ్రీచరణిని పోల్చాడు. 'శ్రీ చరణి బంతి తిప్పే విధానం, వేగం అద్భుతం. ఆమె బౌలింగ్ టెక్నిక్ సోఫీ ఎక్లెస్టోన్, జెస్ జోనాసెన్, సోఫీ మోలినెక్స్ వంటి టాప్ స్పిన్నర్ల తరహాలోనే ఉంది. ఆమె వెయిట్ ట్రాన్స్‌ఫర్ అమోఘం. బౌలింగ్ చేసే సమయంలో ఆమె శక్తి ఏం వృథా కావడం లేదు. భవిష్యత్తు



శ్రీచరణి తప్పకుండా సూపర్ స్టార్ బౌలర్ అవుతుంది.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు. భారత్ సాధించిన అన్ని ప్రపంచకప్‌ల కంటే ఈ విజయం ఎంతో గొప్పదని కొనియాడాడు. ముఖ్యంగా ప్రపంచకప్ టైటిల్‌ను మాజీ క్రికెటర్లు అయిన మిథాలీ రాజ్, జులాన్ గోస్వామికి అందించడాన్ని అశ్విన్ ప్రత్యేకంగా అభినందించాడు. 'భారత మహిళల జట్టు ప్రపంచకప్‌ను తీసుకెళ్లి మిథాలీ రాజ్ చేతిలో పెట్టింది. ఈ విషయంలో నేను హర్మన్ సేనను అభినందిస్తున్నా. భారత పురుషుల జట్టు ఇలా గతంలో ఎప్పుడూ చేయలేదు. కొన్నిసార్లు మీడియా ముందు మాత్రం ఏదో చెబుతుంటాం. ఆ వ్యక్తి అలా చేశాడు.. ఇలా చేశాడని గొప్పగా చెబుతాం. కానీ మాజీ ఆటగాళ్లకు క్రెడిట్ ఇవ్వడాన్ని నేను అయితే చూడలేదు. మా తరం బాగుంది. మీ తరం టీమ్ అంత గొప్పగా లేదనే చర్చలే ఎక్కువగా జరుగుతుంటాయి.

# థ్రిల్లర్ మూవీలో మీనాక్షి



ప్రముఖ నటి మీనాక్షి చౌదరి కొత్త పాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదలైంది. నాగచైతన్య హీరోగా 'విరూపాక్ష' దర్శకుడు కార్తీక్ దండు ఓ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్. సోమవారమే ఈ సినిమాలో ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ ను విడుదల చేస్తామని నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ తెలిపారు. అయితే చేవెళ్ళ బసు దుర్ఘటనతో దానిని ఈ రోజుకు వాయిదా వేశారు. ఆ ప్రకారంగా మీనాక్షి చౌదరి ఫస్ట్ లుక్ పోస్టర్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇంకా పేరు పెట్టని ఈ మిథికల్ థ్రిల్లర్ మూవీలో దక్ష అనే ఆర్కియాలజీ సైంటిస్ట్ పాత్రను మీనాక్షి చౌదరి చేస్తోంది. తాజా విడుదలైన పోస్టర్ చూస్తుంటే... ఈ పాత్ర సినిమాలో చాలా కీలకమైందనేది అర్థమౌతోంది. దర్శకుడు సుకుమార్ సైతం నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాతో 'లాపతా లేడీస్' ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నాడు. ప్రముఖ కన్నడ సంగీత దర్శకుడు అజనీశ్ బి. లోకనాథ్ దీనికి సంగీతం అందిస్తున్నాడు.

# పెద్దిలో మొహిత్ చౌహాన్ పాట



రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సాన దర్శకత్వం వహిస్తున్న 'పెద్ది' సినిమా ప్రమోషన్స్ షురూ అయ్యాయి. సినిమాకు సంబంధించి ఏదో ఒక అప్‌డేట్ ఇస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. తాజాగా కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ క్యారెక్టర్ రివీల్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు. అలాగే ఫస్ట్ సింగిల్ టైటిల్ కూడా తెలిపారు. ఈ పాట 'చికిరి' అనే లైన్‌తో ఉంటుందని తెలిసింది. ఈ విషయాన్ని స్వయంగా ఎ.ఆర్.రెహమాన్ వెల్లడించారు. దర్శకుడు, సింగర్ మోహిత్ చౌహాన్‌తో కలిసి కీ బోర్డ్ ముందుకు కూర్చున్న ఫొటోను రామ్‌చరణ్ షేర్ చేసి ఏం వండుతున్నారు గయ్స్' అని ట్వీట్ చేశారు. దానికి 'చికిరి చికిరి.. చరణ్‌గారు' అంటూ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ రిప్లై ఇచ్చారు. దర్శకుడు కూడా అదే సమాధానమిచ్చారు. ప్రస్తుతం ఎక్స్‌లో వీరి సంభాషణ నెట్టింట వైరల్ మారింది. పాట కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు అభిమానులు పోస్టులు పెడుతున్నారు. అయితే ఈ పాట ప్రమోషనల్ వీడియోలో రెహమాన్ కూడా కనిపించబోతున్నారు. చికిరి పాటకి సింగర్ గా మోహిత్ చౌహాన్‌ను ఎంపిక చేశారాయన. హిందీలో ఆయన ఎన్నో హిట్ చిత్రాలకు పాటలు పాడారు. అక్కడ ఆయన ఎంతో పాపులర్. 'రాక్ స్టార్' సినిమాలో మొత్తం 15 పాట ఉంటే అందులో తొమ్మిది పాటలిన మోహిత్ ఛౌహాన్‌తోనే పాడించారు రెహమాన్. దాంతో ఆయన పేరు పాపురల్ అయింది. మోహిత్ తెలుగు సంగీత దర్శకులతో ఎక్కువ పని చేయలేదు కానీ తమిళ సినిమా పాటల్ని తెలుగులో పాడారు. ఆయన వాయిస్ కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. దర్శకుడు నాగ్ అశ్విన్‌కు ఆయనపై ప్రత్యేక అభిమానంతో 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాలో 'ఇదేరా' అంటూ సాగే పాటను పాడించారు. తర్వాత డైరెక్ట్ తెలుగు సినిమా పాడిన సందర్భం లేదు. ఇప్పుడు 'పెద్ది' సినిమాతో

# పిఠాపురంలో..అలా మొదలయ్యింది



తొలి చిత్రం 'ప్రేయసి రావే'తోనే దర్శకునిగా తన సత్తా చాటుకున్నారు మహేష్ చంద్ర అయోధ్య రామయ్య, చెప్పాలని వుంది, జోరుగా హుషారుగా, ఒక్కడే, హనుమంతు, ఆలస్యం అమృతం, రెడ్ అలర్ట్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా ఆయన రూపొందించిన చిత్రం 'పిఠాపురంలో'. 'అలా మొదలైంది' అనేది ఉపశీర్షిక. రాజేంద్రప్రసాద్, పృధ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ తదితరులు ముఖ్య తారాగణంగా ఈ చిత్రం రూపొందింది. మహేష్ చంద్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌పై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్ఎం మురళి నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. సందర్భంగా దర్శకుడు మహేష్‌చంద్ర మాట్లాడుతూ 'కుటుంబ భావోద్వేగాలు కలగలిసిన ప్రేమకథ ఇది. ఇందులో మూడు జంటల ప్రేమకథలు చూడొచ్చు. ముగ్గురు తండ్రుల పెంపకాల్లోని లోటుపాట్లనీ చూడొచ్చు. ప్రేక్షకులు ఏదో ఒకరకంగా ఈ కథతో కనెక్ట్ అవుతారు. ఈమధ్య కాలంలో 'పిఠాపురం' అనేది ఎంతలా మారుమోగిందో అందరికీ తెలిసిందే. ఆ పిఠాపురం నేపథ్యంలోనే సినిమా అంతా సాగుతుంది. పిఠాపురం పరిసర ప్రాంతాల్లో 28 రోజులు, హైదరాబాద్‌లో 15 రోజులు, గోవాలో 6 రోజులు చిత్రీకరణ జరిపాం. ఇందులో మొత్తం మూడు పాటలు ఉంటాయి. గోవాలో ఒక పాటను, హైదరాబాద్‌లో సెట్‌వేసి ఇంకో పాటను, సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్‌లో మరో పాటను చిత్రీకరించాం. దర్శకునిగా నాకు జీవితాన్ని ప్రసాదించిన రామానాయుడు గారి స్ఫూర్తితో కథను నమ్మి, ఎక్కడా వేస్టేజ్ లేకుండా ఈ సినిమా తీశాం. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం' అని తెలిపారు.


# రాజాసాబ్ సంక్రాంతికి పక్కా

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రాల్లో ది రాజాసాబ్ సంక్రాతికి పక్కా అని నిర్మాత తేల్చి చెప్పారు.. మారుతీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రంలో మాళవిక మోహన్, నిధి అగర్వాల్, రిద్ధి హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక ఎప్పుడెప్పుడు ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుందా అని అభిమానులు వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. ఇక ప్రభాస్ సినిమా అంటే వాయిదా లేకుండా రిలీజ్ ఉండదు అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ది రాజాసాబ్ కూడా అదే తరహాలో వరుస వాయిదాలు పడుతూ వస్తుంది. డిసెంబర్ 5 న అనుకున్న సినిమా మరోసారి వాయిదా పడి సంక్రాంతి బరిలో దిగింది. జనవరి 9 న ది రాజాసాబ్ రిలీజ్ కు సిద్ధమవుతుంది. ఇక గతకొన్నిరోజులుగా సంక్రాంతి నుంచి కూడా రాజాసాబ్ తప్పకుందని వార్తలు వస్తున్నాయి. తాజాగా రాజాసాబ్ వాయిదా రూమర్స్ ను నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఖండించాడు. కచ్చితంగా రాజుగారు సంక్రాంతికి వస్తున్నారని తెలిపారు. ప్రమోషన్స్ కూడా మొదలుపెట్టనున్నట్లు.. డిసెంబర్ లో అమెరికాలో ప్రీ రిలీజ్ ఈవెంట్ చేయనున్నట్లు చెప్పకొచ్చారు. ఇలాంటి పుకార్లను నమ్మకుండా ఉండాలని అభిమానులను కోరాడు. ప్రసుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది. మరి ఈ సినిమాతో ప్రభాస్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.




# చరణ్ ను ఫాలో అవుతున్న రామ్





తెలుగు సినిమా హీరోల ట్యాగ్ అప్పుడప్పుడు మారుతూ ఉండటం చాలా సందర్భాల్లో చూస్తూనే వచ్చాం. హీరో కెరీర్లో బాగా పైకి ఎదిగినప్పుడో లేదంటే భారీ హిట్ అందుకున్నప్పుడో, ఆ స్థాయికి తగ్గట్టు కొత్త ట్యాగ్ ను పెట్టుకోవాలని భావించి, ఆ ఇమేజ్ కు తగ్గ ట్యాగ్స్ ను పెట్టుకుంటారు. అయితే ఆ ట్యాగ్స్ ను ఆడియన్స్ అన్నీ సందర్భాల్లో యాక్సెప్ట్ చేయాలని లేదు. గ్లోబల్ స్టార్ నుంచి మళ్లీ మెగా పవర్ స్టార్ చరణ్ ఆర్ఆర్ఆర్ సినిమాతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న రామ్ చరణ్ ఆ సినిమా తర్వాత తన పేరుకు ముందు గ్లోబల్ స్టార్ అనే కొత్త ట్యాగ్ ను తగిలించుకుని, పాత ట్యాగ్ అయిన మెగా పవర్ స్టార్ ను పక్కన పెట్టారు. కానీ చరణ్ గ్లోబల్ స్టార్ అనే ట్యాగ్ తో చేసిన ఆచార్య, గేమ్ ఛేంజర్ సినిమాలు ఫ్లాపవడంతో ఆ ట్యాగ్ పై నెట్టింట చాలా విమర్శలొచ్చాయి. దీంతో తన నెక్స్ మూవీ కోసం చరణ్ తన పాత ట్యాగ్ అయిన మెగా పవర్ స్టార్ గానే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఉస్తాద్ ను వద్దనుకుంటున్న రాపో ఇప్పుడు చరణ్ ను చూసి మరో యంగ్ హీరో కూడా అదే బాట పడుతున్నట్టు తెలుస్తోంది. అతను మరెవరో కాదు, టాలెంటెడ్ హీరో రామ్ పోతినేని. టాలీవుడ్ ఎనర్జిటిక్ స్టార్ గా మంచి పేరు, గుర్తింపు తెచ్చుకున్న రామ్, ఇస్మార్ట్ శంకర్ సినిమా బ్లాక్ బస్టర్ తర్వాత తన ట్యాగ్ ను ఉస్తాద్ గా మార్చుకున్నారు. ఎనర్జిటిక్ స్టార్ నుంచి ఉస్తాద్ గా మారినప్పటి నుంచి రామ్ ఇప్పటివరకు హిట్ ను అందుకున్నది లేదు. పైగా ఆడియన్స్, ఫ్యాన్స్ కూడా రామ్ ను ఉస్తాద్ అనే దానికంటే ఎనర్జిటిక్ స్టార్ అని పిలుచుకోవడానికే ఆసక్తి చూపారు. అందుకే ఇప్పుడు రామ్ తిరిగి తన పాత ట్యాగ్ కు షిఫ్ట్ అవుతున్నారు. తన తర్వాతి సినిమా ఆంధ్రా కింగ్ తాలూకా కోసం రామ్ ఎనర్జిటిక్ స్టార్ అనే ట్యాగ్ నే పెట్టుకుంటున్నారు. కొత్త ట్యాగ్ లు పెట్టుకోవాలంటే ఫ్యాన్స్ కు ఇష్టముండాలని భావించిన చరణ్, రామ్ ఇకపై తమ పాత ట్యాగ్‌ల తోనే కంటిన్యూ అవాలని ఆసక్తి చూపుతున్నారు.




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613